

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గిరిజన సంక్షేమానికి..


పెద్దపీట

- కాలువ పనులు పూర్తి చేయాలి
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- పంచాయతీగా ఎంగంపల్లి తండా
- రూ.55 లక్షలతో సీసీ రోడ్డు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

వార్త 7 లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నాగర్‌కర్నూల్

బుధవారం 2, ఆగస్టు 2017 | పేజీలు 20

హామీలు...

కృష్ణార్పణం

2

ఏళ్లు గడుస్తున్నా సోమశిల - సిద్ధేశ్వరం వంతెన వాగెక్కడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు ఇచ్చిన హామీలు కృష్ణార్పణమయ్యాయి. సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడే వంతెన నిర్మాణానికి అవసరమైన సాంకేతిక, పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. 2009లో శంకుస్థాపన కూడా చేశారు. కానీ, నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వంతెన సాధన కోసం ఉద్యమం రాజుకుంటోంది.

● ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్



ఏటవతల కూతురుంటది..

ఎల్లమ్మ, రామాపురం : ఏటి ఆవుతల వుండే కొనిదేల గ్రామానికి మాకు పాత బంధుత్వం ఉండడంతో నా బిడ్డను ఇచ్చాను. ఆమె దగ్గరకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. మస్తు బస్సు చార్జీలతో పాటు రోజంతా సమయం పడ్తోంది. పుట్టిలో వెళ్లాలంటే భయంగా ఉంది. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- వాగెక్కని సోమశిల - సిద్ధేశ్వరం వంతెన
- 2007లో బల్లకట్టు మునిగి 61 మంది జలసమాధి
- బ్రిడ్జి నిర్మిస్తామని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ హామీ
- రూ.150 కోట్లతో ప్రణాళిక రూపకల్పన
- శంకుస్థాపనకే పరిమితమైన నిర్మాణం
- బ్రిడ్జితో ఉభయ రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనం
- ఏళ్ల తరబడి నిరీక్షించినా ఫలించని స్వప్నం
- వంతెన కోసం రాజుకుంటున్న ఉద్యమం



సోమశిల - సిద్ధేశ్వరం వంతెన ఊహాచిత్రం

20



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ అమరేందర్

సమస్యలను పరిష్కరించాలని..

రోడ్డెక్కిన విద్యార్థినులు

4

- అల్పాహారం చేయకుండా నిరసన
- భోజనం చేయలేకపోతున్నామని ఆరోపణ
- తాగడానికి నీళ్లు లేవని ఆవేదన
- విద్యాశాఖాధికారుల హామీతో ఆందోళన విరమణ

కేసీఆర్ మాయల మరాఠి

- బీజేపీ మద్దతు లేకుండా తెలంగాణ వచ్చేదేనా..?
- వాగ్దానాలను విస్మరిస్తున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలన
- బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు నాగం జనార్దన్‌రెడ్డి



పాలమూరు-రంగారెడ్డి మ్యాపును చూపిస్తున్న నాగం జనార్దన్ రెడ్డి



- అచ్చంపేట డివిజన్లో జాడలేని చినుకు
- తొలకరికి విత్తనాలు వేసుకున్న రైతులు
- 10 రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు
- పొలాల్లో వాడి పోతున్న మొక్కలు
- ఆవేదనలో అన్నదాతలు

3

కురిసినట్లే కురిసి..

తొలకరి మొదట్లో మురిపించిన వానలు.. ఆ తర్వాత ముఖం చాటేశాయి. అచ్చంపేట డివిజన్లో దాదాపు రెండు వారాలుగా చినుకు జాడలేదు. దీంతో అంతో ఇంతో ఎదిగిన మొక్కలు వాడుపడ్తున్నాయి. బోర్లు, బావుల్లో కొద్దిగా నీళ్లున్న రైతులు డ్రిప్ ఏర్పాటు చేసుకొని పంటలను కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. నీళ్లు అందుబాటులో లేని రైతులు వర్షం కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు.


● అచ్చంపేట

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రూ. 12 కోట్లతో ఉమామహేశ్వర క్షేత్రంలో

పర్యాటక అభివృద్ధి

- శ్రీ ఉమామహేశ్వర ఆలయ ఈవో శ్రీనివాసరావు



అచ్చంపేట: జిల్లాలో ఎంతో చరిత్ర గలిగిన ఆలయాల్లో ఒకటైన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.12 కోట్లను మంజూరు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాయని ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో ముఖాముఖి మాట్లాడారు.

ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. ఎంతో మంది ఆలయ కమిటీ చైర్మన్‌గా విధులు నిర్వహించి ఆలయ అభివృద్ధికి తోడ్పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టూరిజానికి పెద్దపీట వేయాలని సంకల్పించి రూ. 12 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు పనులు కూడా ప్రారంభించాం.

ఆలయంలో సరిపడ సిబ్బంది ఉన్నారా ? వసతులు ఎలా ఉన్నాయి ?

క్షేత్రంలో 65ఏ ప్రకారం ఆలయ ఆదాయం నుంచి 30 శాతం వేతనాలను సిబ్బందికి ఇస్తున్నాం. ఆలయంలో ఇద్దరు అర్చకులు, ఐదుగురు స్వీపర్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండర్, వాచ్‌మెన్, హోమ్‌గార్డు ఉండగా దిగువన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో రోజువారిగా విధులు నిర్వహించే అర్చకుడు, వాచ్‌మెన్ ఉన్నారు. వసతులు లేవని ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. ఉత్సవాలు జరిగే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అప్పుడు మాత్రం కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ప్రతి నెల ఆలయ ఆదాయం, ఖర్చు ఎలా ఉంది ?

ఆలయానికి ప్రతినెల రూ. లక్షా 50 వేల నుంచి 2 లక్షల వరకు ఆదాయం వస్తుంటుంది. రూ.1.50 లక్షలు సిబ్బంది వేతనాల కింద ఖర్చు చేస్తుంటాం. మిగిలిన డబ్బులను ఆలయ అభివృద్ధికి వినియోగిస్తాం.

కొత్త పాలక వర్గం ఏర్పాటైందా..?

ఆగస్టు 2న ఆలయానికి నూతన పాలక మండలి పూర్తి స్థాయిలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో జనవరి నుంచి ఉత్సవాల నిర్వహణ కోసం కందూరి సుధాకర్‌ను ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నియమించాం.. పూర్తి స్థాయి నియామకం ఆగస్టు 2 నుంచి కానుంది. పాలక మండలి సహాయ, సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం.

లింగాలను గ్రామ పంచాయతీ చేయాలి

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లిని గ్రామ పంచాయతీ చేయాలని మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు వావిళ్ల వెంకటమ్మ డీపీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం పోతేపల్లి గ్రామ పంచాయతి పరిధిలో ఉన్న లింగారెడ్డిపల్లి వెయ్యికి పైగా జనాభా ఉందన్నారు. గ్రామాన్ని పంచాయతీగా గుర్తిస్తే ప్రజలకు అన్నివిధాలుగా అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- తాలుకా వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీశైలం

లీడర్ వాయిస్



అచ్చంపేట: ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వడ్డెర్లను తెలంగాణ ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని తాలుకా వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీశైలం కోరారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో వడ్డెర కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాళ్ళు, రప్పలను నమ్ముకొని కాయకష్టం చేసినా కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వడ్డెరులకు ప్రభుత్వం రాయితీపై క్రషర్ మిషన్లు, అలాగే అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. ఎస్టీలకు అందే ప్రతి రాయితీని అందజేయాన్నారు.

హామీలు.. కృష్ణార్పణం

- వాగెక్కని సోమశిల - సిద్ధేశ్వరం వంతెన
- రూ.150 కోట్లతో ప్రణాళిక
- ఏళ్ల తరబడి నిరీక్షించినా ఫలించని స్వప్నం
- వంతెన కోసం రాజుకుంటున్న ఉద్యమం

సోమశిల సిద్ధేశ్వరం వంతెన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ఒక్క అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య దూరాభారాన్ని తగ్గించి రవాణా సౌలభ్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ వంతెన నిర్మాణాన్ని తలపెట్టారు. కానీ ఎనిమిదేళ్లు గడిచినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణానికి సాంకేతిక, పరిపాలన అనుమతులు సమైక్య రాష్ట్రంలోనే మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ దాకా వచ్చి శంకుస్థాపన కూడా జరిగినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో క్రమంగా వంతెన సాధనోద్యమం రాజుకుంటోంది.

● ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్




సోమశిల సిద్దేశ్వరం వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

కొల్లాపూర్ మండలంలోని ప్రముఖ దైవక్షేత్రం సింగవట్నం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకునేందుకు 2007, జనవరి 18న కృష్ణానది తీరప్రాంతాలకు చెందిన 75 మంది భక్తులు బల్లకట్టులో పయనమయ్యారు. సామర్థ్యానికి మించి ప్రయాణించడంతో మంచాలకట్ట వద్ద బల్లకట్టు అదుపుతప్పి నదిలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 61 మంది జలసమాధి అయ్యారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనమయ్యింది. సంఘటనా స్థలాన్ని సందర్శించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సోమశిల - సిద్దేశ్వరం వంతెనను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందుకనుగుణంగా సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి రూ.149.40 కోట్ల రూపాయలతో సోమశిల సిద్దేశ్వరం హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్X సిగ్నల్ ఇచ్చారు. 2009, ఫిబ్రవరి 13న భూమి పూజ కూడా చేశారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు.

బిడ్జి నిర్మాణంతో తగ్గనున్న దూరాభారం

బ్రిడ్జి నిర్మాణం ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌లతో పాటు కర్నూల్ జిల్లాలోని సిద్దేశ్వరం, ఆత్మకూరు, నంద్యాలకు దూరాభారం తగ్గుతుందని ఇరువైపులా సంతోషించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాల ప్రజలు చెన్నై, తిరుపతిలకు వెళ్లడానికి దూరాభారం కూడా తగ్గనుండడంతో దీనిపై ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆశలు పెంచుకున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల మధ్య రెండు కిలోమీటర్ల దూరమే ఉంటుంది. వంతెన నిర్మాణం జరిగితే కర్నూల్ లాంటి నగరాలకు గంట లోపు వెళ్ళొచ్చని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయినా నిర్మాణం విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో నిరాశ వ్యక్తమవుతోంది. రెండు దశాబ్దాలుగా సోమశిల - సిద్దేశ్వరం వంతెన సాధన కోసం తమ ఆందోళనను కొనసాగిస్తున్న వారంతా ఎన్నేళ్లు నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో ఉద్యమబాట పడుతున్నారు. 2009లో శంకుస్థాపన చేసిన సమయంలో కేవలం మూడేళ్ల కాలపరిమితిలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్దేశించినప్పటికీ ఎనిమిదేళ్లు కావస్తున్నా, ఇప్పటి వరకు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

వ్యాపారం అభివృద్ధి చెందుతోంది



సోమశిల సిద్ధేశ్వరం బ్రిడ్జి నిర్మాణం కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. జిల్లాలో మారుమూలనున్న కొల్లాపూర్‌లో వ్యాపారాభివృద్ధి మందకొడిగా ఉంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వ్యాపారం పుంజుకుంటుంది. పట్టణం వ్యాపార కేంద్రంగా మారేందుకు అవకాశం ఉంది. ఇరు రాష్ట్రాలక కొల్లాపూర్ కేంద్రంగా ఉంటుంది. త్వరగా బ్రిడ్జి నిర్మాణం చేస్తే బాగుంటుంది.

- వేముల నాగరాజు, కొల్లాపూర్

వెంటనే బ్రిడ్జి నిర్మించాలి



సోమశిల సిద్ధేశ్వరం బ్రిడ్జి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే పర్యాటక కేంద్రానికి కేంద్ర బిందువు ఆవుతుంది. బ్రిడ్జి నిర్మాణం అగిపోవటానికి ఆంతర్యం ఏంటో ప్రభుత్వం బయటపెట్టాలి. కాలయపాన చేయకుండా బ్రిడ్జి నిర్మాణం చేయాలి.

- కాటం జంబులయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

బిడ్జి నిర్మాణం జరగాలి



సోమశిల - సిద్ధేశ్వరం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా వుంది. రాయలసీమ ప్రాంతం నుంచి ఇక్కడి గ్రామాల ప్రజలకు బంధుత్వం ఉంది. సోమశిలలోని లలిత సోమేశ్వరుడు, నాయినోనిపల్లి మైస మ్మ, ఈదమ్మ, ప్రధానంగా సింగోటం గ్రామంలోని లక్ష్మీ నరసింహ్మా స్వామిని దర్శించుకునేందుకు పుట్టిల్లో వస్తుంటారు. గతంలో 61 మంది పుట్టి మునిగి చనిపోయిన సంఘటన తెలిసిందే. 2009 ఫిబ్రవరి 13న సోమశిల సిద్దేశ్వరం బ్రిడ్జి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఇదే సమయంలో చేపట్టిన అలంపూర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయింది. ఈ వంతెన నిర్మాణం ఒక్క ఇంచు ముందుకు కదల్లేదు.

- వెంకటరెడ్డి, బ్రిడ్జి సాధన కమిటీ నేత

ఆధ్యాత్మికం

కోరిన వరాలిచ్చే..

సిర్సవాడ లక్ష్మినరసింహుడు

సిర్సవాడ (తాడూరు): మండలంలోని సిర్సవాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మినరసింహస్వామి కోరిన వరాలిచ్చే అభయ ప్రదాతగా విరాజిల్లుతున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో లక్ష్మినరసింహస్వామి ఆలయం ఎక్కడా లేకపోవడంతో ప్రతి శుక్ర, శనివారాల్లో భక్తుల రాక ఎక్కువగా ఉంటోంది. ప్రతినెల పౌర్ణమి రోజున శ్రీలక్ష్మినరసింహస్వామి యజ్ఞం, అలాగే పర్వదినాల్లో ఊయలసేవ, పల్లకీసేవ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం స్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ ఆలయం జిల్లా కేంద్రం నుంచి 15 కిలోమీటర్లు, కల్వకుర్తి నుంచి 18 కిలోమీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి 23 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రధాన పట్టణాల నుంచి క్షేత్రానికి రహదారి ఉండడంతో స్వామివారి దర్శనార్థం భక్తులు వస్తున్నారు. నమో వెంకటేశ....నమో తిరుమలేశ....!



స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శిగా ప్రసాద్‌గౌడ్



నియామక పత్రం అందజేస్తున్న డీఈఓ జనార్దనX రావు

నాగర్‌కర్నూల్ స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శిగా దుర్గం ప్రసాద్ గౌడ్ నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి జనార్దనX రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన డీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా నియమితులైన ప్రసాద్‌గౌడ్‌ను తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజనX యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రమేష్, నరేందర్, పూర్ణచంద్, రాజనX గౌడ్, కృష్ణయ్య, సంపూర్ణ, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు సంఘం సభ్యులు వెంకటేష్, పీఈటీ, సత్యం, వీరప్ప, కృష్ణయ్య, రవికుమార్, భాస్కర్, మల్లేష్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమార్ల నిరంజనX , శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విలియం, బాలరాజులు అభినందించారు.

కురిసినట్లే కురిసి..



వర్షాలు లేక స్ప్రింక్లర్‌లతో అందిస్తున్న నీరు

- అచ్చంపేట డివిజన్లో జాడలేని చినుకు
- తొలకరికి విత్తనాలు వేసుకున్న రైతులు

అచ్చంపేట : వర్షాలు కురిశాయన్న ఆనందంతో రైతులు వడి వడిగా విత్తనాలు సాగుచేశారు. దీంతో గత మూడేళ్ళకంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం ఒక్కసారిగా పెరిగి పోయింది. అడపా దడపా వచ్చిపోతున్న వర్షాలతో పంటలు పండుతాయని, చేసిన అప్పులు తీరుతాయని ఆశించిన రైతులు ఇప్పుడు నిరాశలో మునిగిపోయారు. గత 10 రోజులుగా వరణుడు మొహం చాటేయడం, మే మాసాన్ని తలపించే విధంగా ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఇప్పుడిప్పుడే నేలను చీల్చుకొని బయటకొచ్చిన మొలకలు వాడిపోతున్నాయి. బోర్లలో, బావుల్లో అంతో ఇంతో నీళ్ల, కొంత ఆర్థిక స్థోమత ఉన్న రైతులు డ్రిప్పు సిస్టమ్ ఏర్పాటు చేసుకొని మెట్టపంటలను కాపాడుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ మాత్రం నీళ్ల అందుబాటులో లేని రైతులు చినుకు రాక కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. అచ్చంపేట డివిజన్ పరిధిలో ఈ ఏడాది పత్తి 55,063 ఎకరాలు, జొన్న 345 ఎకరాలు, మొక్కజొన్న 15,556 ఎకరాలు, కంది 398 ఎకరాలు, ఆముదం 50 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెప్తున్నాయి.

వరుణ పూజలు

దాదాపు రెండు వారాలుగా వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరణుడు కరుణించాలని కనిపించిన దేవర కల్లా మొక్కుకుంటున్నారు. గ్రామ దేవతలకు వరద పాశాం పోస్తున్నారు. ప్రతి నిత్యం నియోజకవర్గంలోని ఏదో ఒక గ్రామంలో వరణుడి కోసం పూజలు కొనసాగుతున్నాయి. వర్షాలు కురవాలని, పంటలు పండాలని ప్రతి రైతు తమ ఇష్ట దైవాలను వేడుకుంటున్నారు. ఏది ఏమైనా వారం రోజుల్లో వర్షం కురవకపోతే పరిస్థితి చేయి దాటి పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే వానాకాలం వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది.

వర్షం పడితేనే గట్టెక్కేది



ముందు ముందు కురిసిన వర్షాలకు పంటలైతే సాగు చేసినం. కానీ ఇప్పుడు పంట ఎదగాలంటే వర్షం పడాలే. భూమి కౌలుకు తీసుకొని అప్పుచేసి పంటను సాగు చేస్తున్నా. ఈ సమయంలో వర్షం పడితినే గట్టెక్కేది. లేదంటే బతుకు కనాకష్టమే.

- రామలింగయ్య యాదవ్, కౌలు రైతు

వర్షం కురవక పోతే కష్టమే



ఈ సారి వర్షాలు కురిసినట్టే కురిసి మొలకలు ఎల్లగానే ఎనక్కెళ్లిపోయాయి. వారం రోజుల్లో వాన పడక పోతే మొలకలు ఎండిపోతయ్. ఇట్లయితే ఇగ బతికేది కష్టమే. కాలం ఇట్లనే ఉంటే పంటలు చేతికందే పరిస్థితి లేదు.

- కృష్ణయ్య, రైతు

వర్షాలు పడ్తయనే సాగు చేసినం



వర్షాలు పడ్తయనే ఆశతో ఈ సారి ఎక్కువ సాగు చేసినం. తీరా ఎదిగేటప్పుడు వానలు కురుస్తలేవు. పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఈ సారైనా వర్షాలు మంచిగ వస్తయనుకున్న. కానీ ఇంతకు ముందైనట్లే అయ్యింది.

- జి.బాల్‌రెడ్డి, రైతు

యూరియా ఉపశమనాన్నిస్తుంది



వానలు లేక తేమ లేని సమయంలో మొక్కలకు వేర్ల నుంచి నత్రజని అందదు. ఈ సమయంలో ఒక గ్రాము యూరియాను ఒక లీటరు నీటితో కలిపి ఎకరాకు 900 గ్రాముల చొప్పున విత్తన మోతాదులో పిచికారి చేసుకుంటే కొంత మేలు చేకూరుతుంది.

- సందీప్, ఏఓ

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

అచ్చంపేట: సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం పట్టణంలోని సత్యలక్ష్మీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను అధికారికంగా జరుపుకోవాలని ఉద్యమ సమయంలో గొంతెత్తి చాటిన కేసీఆర్ అధికారంలోకి రావాలని ఎంఐఎంకు బయబడి మాట మార్చారన్నారు. ముస్లింకు బీసీ కేటగిరిలో 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని పదే పదే ప్రకటించడం ముస్లింలను మోసం చేయడంతో పాటు బీసీలకు అన్యాయం చేయడమేనన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేంత వరకు మా పోరాటం ఆగదన్నారు. రజాకర్ల ఆగడాలతో ఎంతో మంది మహిళలు బలి అయ్యారని ఆడవాలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించారని, బతుకమ్మ పండగను రాష్ట్ర పండుగగా గుర్తించినప్పుడు ఆనాటి సంఘటనలు కేసీఆర్‌కు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని, ఇసుక మాఫియాతో పాటు ఇరిగేషన్ డిజైన్‌ల మార్పిడితో కోట్లాది రూపాయలను పెంచుతూ ప్రాజెక్టులలో అవినీతికి పాల్పడుతున్నారని, కాంట్రాక్టర్లకు అనుకూలంగా అర్హత లేకున్నా టెండర్లు కట్టబెడుతున్నారన్నారు. మునిగిపోయేది పాలమూరు సాగు చేసుకుని బతికేది ఇంకొకరా అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎవ్వరికి అన్యాయం జరగకూడదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని, డబుల్ బెడ్ రూంలు, కేజీటూ పీజీ, ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చి ముఖ్యమంత్రి కొడుకైనా, ఎంత పెద్ద కలెక్టర్ కొడుకైనా ఒకే భోజనం చేస్తూ ఒకే చెత్తుకింద ఉండేలా వసతులు కల్పిస్తానని గొప్పలు చెప్పి ఇంత వరకు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని, ప్రధాని నరేంద్ర మోడి ప్రవేశ పెట్టిన పథకాలు ప్రతి పల్లెకు, ప్రతి గడపు చేరే విధంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. జిల్లాలు, మండలాల పునర్విభజన చేసి 10 నెలలు కావస్తున్నా ఇంత వరకు సేవలు పూర్తి స్థాయిలో కొనసాగడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం శశిధర్‌రెడ్డి, రాష్ట్ర మీడియా కన్వీనర్ సోలంకి శ్రీనివాస్, జాతీయ నాయకులు మంగ్యానాయక్, కిసాన్ మోర్చ నాయకుడు సుగునాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్ట సుధాకర్‌రెడ్డి, జిల్లా ఇంచార్జీ శ్యాంసుందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, అర్థం రవి, అచ్చంపేట అసెంబ్లీ ఇనX చార్జ్ మల్లేశ్వర్, జిల్లా నాయకులు బాలాజీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో
ఖాళీలను భర్తీ చేయాలి

- గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్

వనపర్తి వ్యవసాయం: రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే జనాభాకు అనుగుణంగా భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటైన తరువాత ఆర్డర్ టూ సర్వ్ ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని రద్దు పరుస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా ఎవరి జిల్లాల ఉద్యోగులను ఆయా జిల్లాలకు కేటాయించాలని పేర్కొన్నారు. ఆయా జిల్లాలో పనిచేసే వీఆర్‌వోలకు పదోన్నతుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, రెవెన్యూ ఉద్యోగులపై భౌతిక దాడులను నివారించాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని తెలిపారు. ఇనX చార్జి అలవెన్సు, స్టేషనరి ఖర్చులు ఇవ్వాలని, 11వ పీఆర్‌సీ కమిటీని బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు. సమగ్ర భూ సర్వే చేసి రెవెన్యూ రికార్డులను ఆధునీకరిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

- గద్వాల జిల్లా విద్యాధికారి వేణుగోపాల్

ధరూర్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని జిల్లా విద్యాధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ధరూర్ మండలంలోని పార్చర్ల గ్రామంలో హరితహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీల వారిగా 40వేల మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని తెలిపారు. చెట్లను నాటితే పర్యావరణాన్ని కాపాడవచ్చని ఆయన తెలిపారు. కార్బనX డైఆక్సైడ్ వల్ల గ్రామీణ ప్రాంతాలు కూడా కాలుష్యంతో నిండిపోయాయని వాటిని దృష్టిలో ఉంచుకుని చెట్లను పెంచడం ద్వారా మానవాళికి సరైన ఆక్సిజనX లభిస్తుందని వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు తమ పొలాల వద్ద చెట్లను నాటాలని తెలిపారు. చెట్లను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధరూర్ తహసీల్దార్ సమద్, ఎంపీడీఓ నర్సింహనాయుడు, ఎంఈవో సురేష్, స్థానిక సర్పంచు సత్యన్న, పాఠశాల ఉపాధ్యాయుడు చక్రధర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గంగారం (బిజినేపల్లి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగారం గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి గుంటి రామాంజనేయులు(37) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంజనేయులు హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఇటీవల పిల్లల చదువుల కోసం నాగర్‌కర్నూల్ పట్టణానికి మకాం మార్చాడు. తాగుడుకు బానిసైన రామాంజనేయులు కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం ఉదయం స్వస్థలమైన గంగారం గ్రామం వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అంబులెనXస్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా రామాంజనేయులు మృత్యువాత పడ్డాడు. ఈ విషయంపై భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు.

26 గొర్రె పిల్లల మృతి

పానగల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్యకు సంబంధించిన 26 గొర్రె పిల్లలుకు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గొర్రెల కాపరి తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి గొర్రె పిల్లలను జల్ల కింద కప్పి మూసి ఉంచడంతో శ్వాస ఆడక మృతి చెందినట్లు చెందాయి. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ. 70వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని
రోడ్డెక్కిన కస్తూర్బా విద్యార్థులు

- అల్పాహారం చేయకుండా నిరసన
- తాగడానికి నీళ్లు లేవని విద్యార్థుల ఆవేదన
- విద్యాశాఖాధికారుల హామీతో ఆందోళన విరమణ



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

అచ్చంపేట అర్బన్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని నడింపల్లి గ్రామంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం 185 మంది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అల్పాహారం చేయకుండా రోడ్డుపై బైటాయించి నిరసన, ధర్నా నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో తాగు నీరు, స్నానాలకు నీళ్ళులేక, విద్యార్థినులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికి మూడు వారాల నుంచి తలస్నానాలు చేయలేదని ఒక మగ్గుతో మొహం కడుక్కునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో వండే భోజనం, కూరగాయలు సక్రమంగా లేకపోవడంతో భోజనం ఇష్టంగా తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులు అవసరముండగా 12 మంది మాత్రమే ఉన్నారని మాథ్స్, బయోలజీ సబ్జెక్టుల్లో టీచర్లు లేక సెలబస్ పూర్త కావడం లేదన్నా రు. గత ఏడాది రోజుకు రెండు ట్యాంకర్లు వస్తేనే సరిపో లేదని, ఈ ఏడాది ఒకే ట్యాంకర్ నీళ్లు వస్తుండడంతో అవి ఏ మూలకు సరిపోవడం లేదన్నారు. విద్యార్థులు రోడ్డుపై బైఠాయించడంతో స్థానిక ఎంఈఓకు జిల్లా విద్యాధికారులకు పాఠశాల ఎస్‌ఓ కుసుమ సమాచారం అందించా రు. వారి సమాచారం మేరకు ఉన్నతాధికారులు స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. కలెక్టర్ వెంటనే స్థానిక ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్ పాండునాయక్‌కు సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వడంతో వారు వెళ్లి పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. మీకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమస్యలు మా దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. తాత్కాలికంగా రెండు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలోనే శాశ్వత నీటి సౌకర్యం కోసం బోరును తవ్విస్తామని హామీ ఇచ్చారు. ఎస్సై అనుదీప్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి భద్రత చర్యలు చేపట్టారు.

బీడీ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి
- జీఎస్‌టీ నుంచి బీడీ పరిశ్రమలను మినహాయించాలి
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

అమరచింత: బీడీ పరిశ్రమలపై జీఎస్‌టీ పన్ను విధించి బీడీ పరిశ్రమలను మరింత నిర్వీర్యం చేస్తూ దేశవ్యాప్తంగా కోటి 20 లక్షల మంది కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. సూర్యం అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మార్క్స భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇది వరకు పుర్రెగుర్తు 85 ముద్రించి బీడీ పరిశ్రమలను ఇబ్బందులకు గురి చేసి ప్రస్తుతం గొంతు క్యాన్సర్‌బొమ్మను ముద్రించి మరింత అబాసుపాలు చేస్తున్నారన్నారు. దేశాన్ని కాలుష్య నివారణ దేశంగా మారుస్తానని లక్ష్యం పెట్టుకోవడం సరైందే అయినా దేశంలో కోటి 20 లక్షల కార్మికులు రోడ్డుపై పడే పరిస్థితి వస్తుంది. ముందుగా బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ఆపై తన లక్ష్యాన్ని పూర్తి చేయాలని మోడీ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కేసీఆర్ మాయమాటలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై విధిస్తున్న ఆంక్షలకు అనుకూలంగా తలాడిస్తూ రాష్ట్రంలోని 7 లక్షల మంది కార్మికులకు ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చినా రాష్ట్రం వత్తాసు పలుకడం సరైందికాదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అటు దే శంలో ఇటు రాష్ట్రంలో కార్మిక వ్యతిరేఖ పాలన సాగిస్తున్న ప్రభుత్వాల విధానాలను తిప్పి కొట్టే విధంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి ఐక్య కార్యచరణ రూపొందించి గ్రామ మండల, జిల్లా స్థాయి ప్రభుత్వం కార్యాలయాల్లో ధర్నాలు నిర్వహించి సెప్టెంబర్ 6న వామపక్ష కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీ యూ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో జీఎస్‌టీ బిల్లుకు వ్యతిరేఖంగా నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రాజు, చింతలయ్య, మండల నాయకులు ప్రేమరత్నం, సామేలు, మస్లామని, భక్తి సత్యన్న తదితరులు ఉన్నారు.

'ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలి'



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కందనూలు: ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న భోధనా, భోధనేతర సిబ్బందికి కనీసం 18వేలు వేతనం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం డిఆర్వో మధుసూధనX నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ప్రైవేటు విద్యావ్యవస్థలో విద్యార్థుల తల్లిదండ్రులతో అధిక ఫీజులు వసూలు చేస్తు భోదనా సిబ్బందికి కనీస వేతనం ఇవ్వకుండా తీవ్ర శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. పాఠశాలలో పనిచేసే సిబ్బందికి మాత్రం అరకొర వేతనాలిస్తూ తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం సంస్థకు వచ్చిన ఆదాయంలో కనీసం 50శాతం వేతనాల కోసం కేటాయించాల్సి ఉండగా ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలో అలాంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను, సిబ్బందిని ఇక్కట్ల పాలు చేస్తున్నా రన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కనీస వేతనం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా నాయకులు శివరాములు, శ్రీను, మండల నాయకులు శివశంకర్, శివ, కుర్మయ్య, సుభాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం

వెల్దండ: మండల కేంద్రం సమీపంలోని కొండకత్వ కుంట వద్ద ఓ వ్యవసాయ పొలంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు బయటపడ్డాయి. గ్రామ సమీపంలోని జంగయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో జేసీబీ యంత్రాలతో గుప్త నిధుల కోసం తవ్వి భూమిలో ఉన్న రాళ్లను తొలగించారు. కాగా గోతి చుట్టూ నాలుగు వైపులా నిమ్మకాయలు పెట్టి పూజలు చేసినట్లు కనిపించడంతో సమీప పొలాల రైతుల ద్వారా సమాచారం బయటకు పొక్కింది. దీంతో జనం గోతిని చూసేందుకు బారులు తీరారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపడతామన్నారు.



గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

ఆంధ్రజ్యోతి
5
కల్వకుర్తి
నాగర్‌కర్నూల్ । బుధవారం 2 ఆగస్టు 2017
కల్వకుర్తి । ఊర్కొండ । వెల్దండ । వంగూరు । చారకొండ

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కల్వకుర్తిఅర్బన్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆర్డీవో రాజేష్‌కుమార్‌కు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.4,000 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని, 30 యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్



పార్థసారథి - దండుపాళ్యం
అశోక - ఫిదా
నేషనల్ - వైశాఖం

వెల్దండ అధికారులు

గిరికుమార్ కల్కోటే - సీఐ - 9848996048
సైదులు - తహసీల్దార్ - 9000101462
ముత్యాల రామ్మూర్తి - ఎస్ఐ - 9440900907
వెంకటేశ్వరరావు - ఎంపీడీఓ - 8008901027
మంజుల - వ్యవసాయాధికారిణి - 7288894317
రాములు - ఏపీఎం - - 8790990686
అమర్‌సింగ్ - ట్రాన్స్‌కో ఏఈ - 9440813451
చంద్రశేఖర్ - ఏఈ పీఆర్ - 9490502030

వచ్చేనెల చివరినాటికి కేఎల్ఐ తాగునీరు

● ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిఅర్బన్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తిచేసి సెప్టెంబర్ చివరి నాటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. బుధవారం కళాశాల విద్యార్థులతో కేఎల్ఐ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం కల్వకుర్తిలోని వైఆర్ఎం కళాశాలలో ఏర్పాటుచేసిన ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులతో ప్రాజెక్టు సందర్శన కార్యక్రమం తలపెట్టామని చెప్పారు. రైతులకు కేఎల్ఐ సాగునీరు అందించి ఇచ్చిన మాట నిలుపుకుంటామన్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమిస్తాం

● టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి రమేష్

కల్వకుర్తిఅర్బన్: టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అమలు పర్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్ గౌడ్, నాయకులు వెంకటేష్, చంద్రకాంత్ , శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

● యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాహుల్



యూత్ కమిటీ నియామక పత్రం అందజేస్తున్న రాహుల్

కల్వకుర్తి రూరల్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని యూత్ కాంగ్రెస్ నియెజకవర్గ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ పిలుపునిచ్చారు. మండలంలోని తర్నికల్ తండాలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యుడావత్ రాజు నాయక్, ఉపాధ్యక్షుడిగా చిన్నా నాయక్, ప్రధాన కార్యదర్శులుగా రాత్లవత్ చిన్న, ఆంగోత్ కిషన్, గణేష్, ముడావత్ ముత్రు, వసురాం, గోపాల్ లతో పాటు 35 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజునాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీపతి, నాయకుడు ముడావత్ దీప్ల పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పక్కాగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీవో

వంగూరు: రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన సక్రమంగా చేపట్టాలని ఆర్‌డీవో రాజేష్ కుమార్ సూచించారు. మంగళవారం వంగూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేసి భూముల రికార్డులను పరిశీలించారు. ప్రతి గ్రామంలో భూములకు సంబంధించిన పాసు పుస్తకం, 1బి, పహాని కబ్జాలో ఉన్న రైతు పేర్లను నిశితంగా పరిశీలిస్తామన్నారు. వీఆర్‌వోలు తప్పొప్పులను సరిచూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల్‌కుమార్, డీటీ రావూఫ్ వీఆర్‌వోలు ఉన్నారు.

హరితహారంతో పర్యావరణ పరిరక్షణ

వంగూరు: హరితహారం పర్యావరణ సమస్యకు పరిష్కారం కానుందని ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో జయసుధ అన్నారు. మంగళవారం మండలంలోని మాచినేనిపల్లి నర్సరీలో రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ కాలుష్యంతో అనేక వైపరిత్యాలు చోటు చేసుకుంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో పచ్చని మొక్కలు వాతావణ కాలుష్య నివారణకు తోడ్పడతాయని తెలిపారు. ఇంతటి మహోన్నతమైన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు నర్సయ్య, చంద్రయ్య, శంకర్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా.. పాడుబడ్డ బావులు

వెల్దండ ఎస్సీ కాలనీలో ఉన్న పాడుబడ్డ బావి

వెల్దండ : గ్రామాల నడిబొడ్డున ఉన్న పాడుబడ్డ బావులు ప్రమాదభరితంగా మారాయి. ఇళ్ల మధ్యలో ఏళ్లకాలంగా నిరుపయోగంగా ఉన్న బావులను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ బావుల్లో కంప చెట్లు పెరిగిపోవడంతో రాత్రిళ్లు కనిపించక పలువురు అదుపుతప్పి బావుల్లో పడిన సందర్భాలు ఉన్నాయి. పంటలకు సాగునీరు అందించేందుకు రైతులు బావులను తవ్వించుకున్నారు. కాలక్రమేణా బావుల్లో నీళ్ల తగ్గిపోవడంతో బోర్లు వేయించుకుని బావులను వదిలేసారు. పాడుబడ్డ బావుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడం, రోడ్డు పక్కన ఉండడంతో మూగజీవాలు అందులో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. వాహనచోదకులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిందే. స్థానికులు చెత్తా చెదారాన్ని పాడుబడ్డ బావుల్లోనే వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. గతంలో ఉపాధి పథకం కింద గ్రామాల్లో బావులను పూడ్చాలని అనుకున్నా అధికారులు చొరవ తీసుకోలేదు. సమస్య అలాగే ఉండిపోయింది.

ప్రమాదకరంగా ఉన్న బావులివే..

మండలంలోని కొత్త గ్రామంలో సందబావి, జిలకరబావిలు గ్రామం నడిబొడ్డులో ఉన్నాయి. వాటిని పూడ్చాలని స్థానికులు అధికారులను కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. వెల్దండ ఎస్సీ కాలనీలో ఉన్న బావి, అజిలాపూర్‌లోని మాలబావి, ఊరబావులు స్థానికులకు ఇబ్బందిగా మారాయి. బావుల సమీపంలో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉంటారని, ఎప్పుడే ప్రమాదం బారిన పడతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వినియోగంలో లేని బావులను పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు .

ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో..



కొత్త నడిబొడ్డున ఉన్న చంద బావి, జిలకరబావిలు ప్రమాదభరితంగా మారాయి. రోడ్డు పక్కనే బావులు ఉండటం వాటికి ఎటువంటి ఫెన్సింగ్ లేకపోవడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. మూగజీవాలు బావుల్లో పడి చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. బావులను పూడ్చాలి.

– రవి, కొత్త

అధికారులు చర్యలు తీసుకోవాలి



అవసరమైన నిధులను మంజూరు చేసి పాడుబడ్డ బావులను పూడ్చాలి. ప్రమాదవశాత్తు చీకటిలో వాటిలో పడితే ప్రాణాలమీదకు వస్తుంది. కనీసం బావులకు ప్రహరీని ప్రత్యామ్నాయంగా నిర్మించాలి.

– స్వరణ్‌సింగ్, వెల్దండ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఊర్కొండ: ఆరోగ్యమైన జీవితం గడపాలంటే... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఎం రాం బుచ్చమయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నర్సంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17 నుంచి చేపడుతున్న కార్యక్రమంలో 9 నెలల నుంచి 15 ఏళ్ల బాల బాలికలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు

ఊర్కొండ: మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై పోలీసులు కేసులు నమోమదు చేశారు. మంగళవారం ఊర్కొండ వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఎవరైనా రోడ్డు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

అంటరానితనం చట్టరీత్యా నేరం : ఎస్ఐ

చారకొండ: అంటరానితనం చట్టరిత్యా నేరమని ఎస్ఐ పోచయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జూపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సాటి మనిషి పట్ల సోదర భావాన్ని చూపి సమసమాజ స్థాపనకు కృషి చేద్దామని అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 65 సంవత్సరాలు గడుస్తున్నా సాటి మనిషిని గౌరవించకుండా అమానుషంగా హింసించడం దురదృష్టకరం అన్నారు. షెడ్యూల్డ్ తెగలపై ఎవరైనా వివక్ష చూపితే ఆరు నెలల కారాగార శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో సారా అమ్మకాలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రావు, వీఆర్‌ఓ భలవంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ పోచయ్య

ఎలికట్ట విద్యార్థినుల ప్రతిభ

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎలికట్ట గ్రామానికి చెందిన మాదే అజితబాలయ్యల కుమార్తె హర్షితాశ్రీ మెడిసిన్‌లో 2913వ ర్యాంకు సాధించి మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇదే గ్రామానికి చెందిన మట్ట జంగయ్య కుమార్తె నాగమ్మ కాకతీయ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో 88వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చిందని సర్పంచ్ రాకేష్‌శర్మ తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

ఎండు తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

● చారకొండ ఏఓ చిన్నహుసేన్

చారకొండ: రైతులు ఎండు తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఓ చిన్నహుసేన్ ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వేసిన పత్తి పంటకు ఎండు తెగులు సోకినట్లు గుర్తించామన్నారు. తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటర్ నీటికి 3గ్రాముల , స్ట్రెప్టోసైక్లిన్ మందును 10లీటర్ల నీటికి గ్రాము చొప్పున పిచికారీ చేయాలన్నారు. కొని చోట్ల రసంపీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ లాంటి వాటిని గుర్తించామని వాటి నివారణకు మోనోక్రోటాపాస్ లేదా ఎసిపేట్ అనే మందును లీటర్ నీటికి 1.5 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.

కొనసాగిన మిల్లు కార్మికుల రిలే నిరాహార దీక్షలు

కల్వకుర్తి రూరల్ : కార్మికుల న్యాయమైన డిమాండ్లు తీర్చేంత వరకు దీక్షలు విరమించే ప్రసక్తి లేదని మజ్దూర్ సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ అన్నారు. మార్చాల సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 22వ రోజు కొనసాగాయి. సూర్యప్రకాష్ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికుల వేతనాలు, 45 రోజుల గ్రాట్యూటీ, ఓవర్ టైం భృతి పెంచాలని కోరారు. దీక్షా కార్యక్రమంలో కార్మికులు చమంతా, శాంతన్న, బృదావన్‌మాగి, దివాకర్‌పాండ్, సువాంత్ మాలిక్, రవీంద్రదాస్, రామారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు దోమ తెరలు ఇవ్వాలి

● గిరిజన ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి రాజు

బల్మూర్: నల్లమల అటవీ, మైదాన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చెంచులకు దోమతెరలు అందించడంతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత సీజన్‌లో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉనందున ఐటీడీఏ ద్వారా ప్రతి చెంచుకుటుంబానికి దోమతెర ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెంచు పెంటల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించక పోవడంతో పాటు వారి వద్ద అవసరమైన మందులు కూడా లేవని ఆరోపించారు. చెంచులకు సరియైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రిజర్వేషన్ల కోసం పోరు బాట పట్టాలి

● బీసీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్

అచ్చంపేట: బీసీలు రాజకీయ రిజర్వేషన్ల కోసం పోరు బాట పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ డ్యాగ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని త్రివేణి కళాశాల ఆవరణంలో ఛలో ఢిల్లీ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు బీసీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సగం కంటే ఎక్కువగా బీసీలు ఉన్నా పార్లమెంటులో మాత్రం 82 మంది బీసీ ఎంపీలు మాత్రమే ఉన్నారని తెలిపారు. పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లును ప్రవేశ పెట్టాలని కోరుతూ ఆగస్టు 6న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, డివిజన్ అధ్యక్షుడు బాలకృష్ణయాదవ్, రమేష్, ప్రశాంత్, రాజు, అంజి, మహేష్, శ్వేత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జిన్‌కుంటలో మొక్కల పంపిణీ


మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

బల్మూర్: మండల పరిధిలోని జిన్‌కుంట గ్రామంలో హరితహారంలో భాగంగా మహిళా సంఘం అధ్యక్షురాలు పుష్పలత, సర్పంచ్ రామన్‌గౌడ్ మంగళవారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలిని గ్రామస్థులకు సూచించారు. దాదాపు మూడు వేల పండ్ల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీసు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, ఉత్తరమ్మ, నాయకులు ప్రేమ్‌కుమార్, ధామోదర్, మహిళలు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

● ఎమ్మార్పీఎస్ అచ్చంపేట ఇన్‌చార్జి ఉస్సేన్

బల్మూర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ అచ్చంపేట ఇన్‌చార్జి బోట్క ఉస్సేన్ డిమాండ్ చేవారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి

పదర: రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణుల కోసం అనేక పథకాలను ప్రవేశ పెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు గోలి విష్ణుమూర్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నాయి బ్రాహ్మణుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 8న ప్రభుత్వం వస్తు ప్రదర్శణ కార్యక్రమం నిర్వహిస్తోందని దానికి మండలంలోని నాయి బ్రాహ్మణులందరు తరలి రావలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న రాములు, ఉపాధ్యక్షుడు జం పుల సత్యం, గ్రామ అధ్యక్షుడు గోలి యాదగిరి పాల్గొన్నారు.

మండల కమిటీ ఎంపిక

ఉప్పునుంతల: నాయిబ్రాహ్మణ సంఘం ఉప్పునుంతల మండల కమిటీ జిల్లా కార్యదర్శి అంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కామచ్చి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జంపుల గణేష్, కోశాధికారిగా బాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, నర్సింహ్మ తదితరులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మూలుగుతూ నక్కుతూ ఉంటే..

ఆదుకునేదెలా..?

● కాలం చెల్లిన 108 వాహనం
● సమయానికి రాదు
● లైట్లు లేక రాత్రి వేళ బయటికి వెళ్లలేని పరిస్థితి
● ఇబ్బందుల్లో రోగులు



కాలం చెల్లిన 108 వాహనం

లింగాల: అత్యవసర సమయంలో సేవలందించే 108 వాహనమే మూలుగుతూ నక్కుతూ ఉంటే ఆపదలో ఉన్న వారిని ఆదుకునేదెలా అని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. లింగాల ప్రథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త 108 వాహనాన్ని మంజూరు చేసింది. కాగా ఇటీవల అధికారులు దానిని వేరే ప్రాంతానికి తరలించి దాని స్థానంలో పాత వాహనాన్ని కేటాయించారు. ఈ వాహనానికి కనీసం డోర్లు కూడా సరిగా లేవని, లైట్లు కూడా లేక పోవడంతో రాత్రి వేళ వాహనం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని మండల వాసులు పేర్కొంటున్నారు. మండలంలోని అనేక గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉంటాయని కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా సరిగా లేవని అటువంటి ప్రాంతాలకు ఇలాంటి వాహనం ఎలా వెళ్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ వాహనం మండల కేంద్రం నుంచి అచ్చంపేటకు వెళ్లాలంటేనే గంటల సమయం పడుతుందని దీంతో రోగికి సరియైన సమయంలో వైద్యం అందని పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వాహనాన్ని సమకూర్చి అత్యవసర సమయంలో రోగులకు వైద్యం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


డాక్టర్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

లింగాల: ఉత్తమ వైద్య సేవలందించినందుకు గాను కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌ను మంగళవారం వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమాల ప్రాంతమైన లింగాలలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించిన డాక్టర్ శ్రీకాంత్‌కు ఉత్తమ అవార్డు రావడం ఈ ప్రాంతానికి, ప్రజలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా క్లస్టర్ అధికారి అశోక్ ప్రసాద్, ప్రభు, వైద్యాధికారి రామావత్ సురేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, హెల్త్ అసిస్టెంట్ దత్తాచారి, యూడిసీ బుచ్చయ్య, ఏఎన్‌ఎంలు, నారాయణమ్మ, ఎల్లమ్మ, చిలకమ్మ, పర్వీన్, అలివేలు, జ్యోతి, ఎల్‌టీలు శివ, బుచ్చయ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఐటీఐ కళాశాలపై చర్య తీసుకోండి'

బల్మూర్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న మండల కేంద్రంలోని శివశంకర్ మొమోరియల్ ఐటీఐ కళాశాల యాజమాన్యంప చర్యలు తీసుకోవాలని మంగళవారం ఉప తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేసినట్లు టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'దళితవాడలో సీసీ రోడ్లు వేయాలి'

బల్మూర్: మండల కేంద్రంలోని 10వ వార్డులోని దళితవాడలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని దళిత సంఘాల నాయకులు శ్రీశైలం, ఉస్సేన్, గణేష్‌కుమార్ తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 15 సంవత్సరాల క్రితం కాలనీలో వేసిన కొన్ని సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమై నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందన్నారు.

'దళితులపై దాడులు హేయమైన చర్య'

పదర: రాష్ట్రఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలోని నేరెల్ల, రామచంద్రాపురం, జిల్లెల్ల తదితర గ్రామాలకు చెందిన దళితులపై జరిగిన దాడులు జరగడం హేయమైన చర్య అని మాలల చైతన్య సమితి డివిజన్ కార్యదర్శి ఎడ్ల సుల్తాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ సహాయంతో ఉపాధి పొందండి

- టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చెన్నకేశవులు

అమ్రాబాద్: సారా తయారీ, విక్రయాలు మానేసిన వారు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెర్మల చెన్నకేశవులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్రాబాద్ మండలానికి చెందిన వెంటకమ్మ, రమణ, ఎల్లమ్మ, అంజమ్మ, వెంగళమ్మ, శ్రీనుతో పాటు మరో 12 మందికి రూ. 2లక్షల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

అర్హులకే రుణాలు అందించాలి

-కాంగ్రెస్ ఎస్సీ సెల్ తాలుకా కన్వీనర్ దివాకర్

అమ్రాబాద్: అర్హత ఉన్న వారికే రుణాలు అందించే విధంగా అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తాలుకా కన్వీనర్ దివాకర్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న రుణాలను అధికారులు, పాలకులు వ్యక్తిగతంగా తమకు అనుకూలంగా ఉండేవారికి అందేలా చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు అర్హత ఉన్న వారికి రుణాలు అందే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సినిమా గైడ్



శ్రీసత్యలక్ష్మి: ఫిదా
శ్రీసాయిరాం: గౌతమ్‌నంద

గ్యాస్ సమాచారం

శ్రీ లక్ష్మీప్రసన్న గ్యాస్ ఏజెన్సీ
భారత్ గ్యాస్ అచ్చంపేట.
ఫోన్ : 9441783722
30వ తేదిన బుక్ చేసుకున్న వారికి 31న సిలిండర్లు పంపిణీ చేస్తారు.

ఇంటర్వ్యూ

వెల్టూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● సర్పంచ్ జంగయ్య



ఉప్పునుంతల: వెల్టూర్ గ్రామాన్ని మండలంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, దీనికి గ్రామంలోని యువకులు, ప్రతి ఒక్కరు సహకారం అందించాలని సర్పంచ్ జంగయ్య ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

గ్రామంలో మౌళిక సదుపాయాలు ఉన్నాయా ?

గ్రామంతో పాటు శివారు తండాలో కొన్ని కాలనీలలో సీసీ రోడ్లు లేవు. మూన్య తండాలో ఎన్ని బోర్లు వేసినా ఉప్పునీరు రావడంతో గిరిజనులకు తాగునీటి సమస్య ఉంది.

14వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయా ?

రూ. 4 లక్షలు వచ్చాయి. వాటిని గ్రామాల్లో నూతన బోర్లు, మోటర్ మరమ్మతుల్పు, మినీ వాటర్ ట్యాంకులు నిర్మించేందుకు ఖర్చు చేశాం.

గ్రామాల్లో డ్రైనేజీలు ఉన్నాయా.. ?

కొన్ని కాలనీల్లో ఏర్పాటు చేశాం. నిధులు వస్తే అంతటా నిర్మిస్తాం.

వెల్టూర్ సంతలో వ్యాపారులు, కొనుగోలుదారులకు వసతులు సరిగా లేవనే ఆరోపణలు ఉన్నాయి.. ?

సంత నిర్వహించే స్థలం లీజుకు తీసుకోవడం వల్ల అక్కడ తాగునీటికి ట్యాంకులు, షెడ్లు ఏర్పాటు చేసేందుకు వీలు కాదు. తాత్కాలికంగా గొర్రెలకు నీటి సౌకర్యం కల్పిస్తాం.

గ్రామంలోని ఇళ్లపై నుంచి 11కేవి విద్యుత్ తీగలు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నారా ?

ఇళ్లపై ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళాం.

మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయా ?

మిషన్ భగీరథ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు ప్రారంభించలేదు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహ

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

విద్యుదాఘాతంతో
ఇద్దరు రైతుల మృతి



స్టాటర్ దగ్గర సక్ర్యాసీత్యా మృతదేహం



రైతు కృష్ణయ్య మృతదేహం

తిమ్మాజిపేట(పోతిరెడ్డిపల్లి)/: వేర్వేరు చోట్ల మంగళవారం ఇద్దరు రైతులు విద్యుదాఘాతంతో మృతిచెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో మంగళవారం బావాజిపల్లి కృష్ణయ్య (58)అనే రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు.. తనకున్న అయిదెకరాల పొలంలో కొంత పత్తి, జొన్న సాగుచేశాడు. వరి వేసేందుకు నారువేసి మంగళవారం ఉదయం కరిగెట మల్లకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటారు నడవకపోవడంతో విద్యుత్ స్టాటర్‌ను పరిశీలిస్తుండగా డబ్బాకు విద్యుత్ సరఫరాకావడంతో అయన అక్కడికక్కడే కుప్పకూలాడు. చుట్టు పక్కల రైతులు వచ్చి బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కృష్ణయ్య గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండడటం వల్ల గ్రామ ప్రజలు, నాయకులు మల్లయ్యగౌడ్, రామస్వామి, తిరుపతయ్యగౌడ్, మాసిరెడ్డి, బాల్‌రాజులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. మల్లయ్యగౌడ్ రూ.3 వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం శవాన్ని జడ్చర్ల ఆసుప్రతికి తరలించారు.

నారాయణపేటరూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం బోయిన్‌పల్లి తండాలో చోటుచేసుకుంది. తండావాసుల కథనం మేరకు.. తండాకు చెందిన సక్ర్యాసీత్యా(60)మంగళవారం 11గంటల ప్రాంతంలో తన పొలంలో బోరు మోటారును ప్రారంభించబోయి స్టాటర్ దగ్గర వైర్లు తేలి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గంట తర్వాత గమనించిన తండావాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య కుంటికిష్టమ్మతో పాటు ఇద్దరు మగ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కాగా మరొకరికి కావాల్సిఉంది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని టీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు.

ఉపాధితోనే పేదరిక నిర్మూలన

- బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కిషన్‌రెడ్డి



కిషన్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మైనార్టీలు

కొత్తకోట: దేశ ప్రజలకు ఉపాధి ఆవకాశాలు కల్పిస్తేనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, అదే లక్ష్యంగా ప్రధాని నరెంద్రమోదీ పని చేస్తున్నారనీ బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో పలువురు మైనార్టీలు బీజేపీలో చేరిన సందర్భంగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు మైనార్టీలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. పార్టీలో చేరిన ముస్లింలను అక్కున చేర్చుకొని సమాన అవకాశాలు కల్పించాలన్నారు. దేశం అభివృద్ధి చెందితే లబ్ధి పొంది లాభపడేది ముస్లింలేనని పేర్కొన్నారు. 50 ఏళ్ళు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకొందన్నారు. అలాగే ఎంఐఎం పేరుతో రాజకీయాల్లో పదవులు అనుభవిస్తున్న నాయకులు వారి అభివృద్ధే లక్ష్యంగా ఆస్తులు కూడ బెట్టారే గాని సామాన్య ముస్లింల బాగుకోసం పని చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే మోదీ విదేశీ పర్యటనలు చేస్తున్నరని చెప్పారు. రానున్న రోజుల్లో భారత్ అగ్రదేశంగా మారబోతోందన్నారు. రాహుల్ గాంధీ రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు మోదీకి తిరుగులేదన్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రావుల రవింధ్రనాధ్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, రజీని, రాజవర్ధన్‌రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీ. కృష్ణ, ఎగ్గని నర్సిహులు, నారాయణ, నాగభూషణం గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, సాయిరాం, నరెందర్‌గౌడ్, రాంమోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వనపర్తి శ్రీను, తోళ్ళ నరెందర్, దాసరి సురేష్ తదితరులు ఉన్నారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట: మంత్రి జూపల్లి



ఎంగంపల్లి తండాలో మొక్కలు నాటుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం ఎంగంపల్లి తండాలో గిరిజనుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంగంపల్లి తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎన్ ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.55 లక్షలతో నేటి నుంచి సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గ్రామానికి సోలార్‌లైట్లు, వాటర్ ట్యాంక్‌లు, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చెప్పారు. ఎంగంపల్లి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామన్నారు. పెంట్లవెల్లి నుంచి ఎంగంపల్లి మీదుగా వచ్చే వాగులో బ్రిడ్జి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిరంజన్ రావు, జడ్పీటీసీ హన్మంత్ నాయక్, మా ర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్, సర్పంచ్ కోట్ల సురేందర్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్, సింగిల్‌విండో చైర్మన్ రఘుపతిరావు, తహసీల్దార్ వెంకటరమణ, పోతుల వెంకటేశ్వర్లు ఎంపీడీవో నాసర్‌రెడ్డి, గిరిజన సంఘ నాయకులు గోపీనాయక్, వార్డు సభ్యులు ఎర్రశ్రీను, సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ సైదయ్య, మురళి నాయక్, సిద్దునాయక్, లక్ష్మన్ నాయక్, బాలీశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలి...

పాన్‌గల్ : వనపర్తి జిల్లా పాన్ గల్ మండలంలో అసంపూర్తిగా ఉన్న భీమా, కేఎల్ఐ కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలని మంత్రి జూపల్లి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కేతేపల్లిలో నియోజకవర్గ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి విష్ణువర్దన్‌రెడ్డితో కలిసి భీమా, కేఎల్ఐ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసుకొనేందుకు అధికారులు కాలువ పనులపై దృష్టి సారించి వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హరితహారంలో ప్రతి ఒక్కరం మొక్కలు నాటి తెలంగాణ రాష్ట్రాన్ని హరితవనంలా మార్చేందుకు కృషి చేద్దామని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. కేతేపల్లిలో గ్రామ ఐక్య సహకార సంఘం సభ్యులకు ఆయన మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరు పది మొక్కలచొప్పున నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జడ్పీటీసీ రవికుమార్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు ముంతభాస్కర్ యాదవ్, జూరాల, కేఎల్ఐ అధికారులు ఏపీఎం మద్దిలేటి, టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్దన్‌సాగర్, సర్పంచ్ రేవతిరాజుగౌడ్, పాన్‌గల్ ఎంపీటీసీ రాంచందర్ యాదవ్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, చక్రవెంకటేష్, సింగోటం, వెంకటయ్య, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవచ్ఛవాలుగా బతికే బదులు బయటకురండి

- టీఆర్‌ఎస్ నేతలకు ఎమ్మెల్యే సంపత్ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంపత్ కుమార్

మహబూబ్‌నగ ర్: టీఆర్‌ఎస్‌లో మనసు చంపుకుని జీవచ్ఛవాలుగా బతికేబదులు ఆ పార్టీని వీడి బయటకు రావాలని అలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. దళితులపై దాడులు జరిగినా ఆ పార్టీలో ఉన్న దళితులు ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పైగా టీఆర్ఎస్‌లో ఉన్న దళితనేతలే మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ పర్యటనపై దుర్భాషలాడటం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉంటూ జాతికి అవమానం జరిగినా నోరుమెదపకుండా ఉండేకన్నా బయటకు వచ్చి దళితపులుల్లా బతుకుదామని సూచించారు. సోనియాగాంధి, మీరాకుమార్ దయవల్ల తెలంగాణ ఏర్పడితే టీఆర్ఎస్‌కు చెందిన బాల్కసుమన్ , రాజయ్య, కర్నెప్రభాకర్, తలసానిశ్రీనివాస్‌యాదవ్‌లు పదవులు అనుభవిస్తున్నారని, కాంగ్రెస్ పెట్టిన భిక్షతో పదవులు అనుభవిస్తున్న ఈ నాయకులు మీరాకుమార్ పర్యటన పై ఇష్టానుసారంగా మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రగతిభవన్ , ఫాంహౌస్‌ల ముందు మోకరిల్లి దళిత వ్యతిరేకులుగా మారుతున్నారని, వీళ్ళను చూసి దళితజాతి సిగ్గుపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వాళ్ళ మాటలు చూస్తుంటే దళిత ప్రజాప్రతినిధిగా తాను సిగ్గుపడుతున్నానని, దళిత జాతి అసహ్యించుకుంటోందన్నారు. చివరకు వీళ్లను చూస్తే ఇంట్లో ఉన్న భార్యా, పిల్లలు అసహ్యించుకునే ప్రమాదం ఉందన్నారు. దళితుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దళిత పక్షపాతిగా ఎన్నోకార్యక్రమాలు చేపట్టిందన్నారు. దళితజాతి రోషం, పౌరుషం ఉన్న జాతి అని ఇష్టానుసారంగా మాట్లాడినా మరోసారి నేరెళ్ళ ఘటనలాంటివి పునరావృత్తమైనా సహించబోమన్నారు. దళితులకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని చెప్పుకుంటున్న టీఆర్ఎస్ నేతలు ఈ మూడేళ్ళలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై టీఆర్ఎస్ దళిత నేతలు చర్చకు రావాలని సవాల్‌చేశారు. తేదీ, సమయం ఎక్కడో మీరేచెప్పాలని ఎక్కడికి రమ్మన్నా రావడానికి సిద్ధమని, దళితులకు మేమే మెరుగ్గా చేశామని నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమన్నారు. తన సవాల్‌కు పైన పేర్కొన్న నాయకుల్లో ఎవరైనా స్పందించాలని లేదంటే మీరు దళిత వ్యతిరేకులని ప్రజలు భావిస్తారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కంచిమి లక్ష్మణ్, రాష్ట్రనేతలు వేణుగోపాల్, బొల్లుకిషన్ పాల్గొన్నారు.

జములమ్మకు భక్తుల విశేష పూజలు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో వెలసిన జములమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు విశేషపూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి నైవేద్యం సమర్పించి చల్లగా చూడాలని వేడుకున్నారు. అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు.

సినిమా సమాచారం

వెంకటేశ్వర: గౌతంనంద
సత్యసాయి : పిదా

అక్రమ మైనింగ్‌కు నెమలి బలి ?


మృతి చెందిన నెమలి

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్ :కొల్లాపూర్ మండలం సింగోటం సమీపంలో బొల్లిగట్టు పై మైనింగ్ తవ్వకాల నిర్వాకం జాతీయ పక్షి ని బలితీసుకుందా? తవ్వకాలు జరిపేచోట నెమళ్ల సంచ రిస్తుంటాయని తవ్వకాలవల్ల వాటి ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణ ప్రేమికులు చేస్తున్న హెచ్చరికలు వాస్తవమయ్యాయా? మంగళవారం సింగోటం సమీపంలోని అగ్రహారంవద్ద నెమలి మరణం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆదరాబాదరగా నెమలిని దహనం చేయడంవెనుక కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అగ్రహారంవద్ద జాతీయపక్షి నెమలి కుక్కకాటుకు గురైందని అగ్రహారంతో సంబంధంలేని కొల్లాపూర్ నగర పం చాయతీ సిబ్బంది గాయపడిన నెమలిని ఫారెస్టు కార్యాలయానికి తెచ్చి హల్‌చల్ సృష్టించారు. దానికి చికిత్స అందించామని, అది మృతి చెందిందంటూ వన్యప్రాణుల సంరక్షణచట్టానికి భిన్నంగా దహనం చేయడం గమనార్హం.

గుండె పోటుతో హెచ్ఎం మృతి


చెర్లపల్లి రాజు (ఫైల్)

కోడేరు: గుండె నొప్పితో ప్రధానోపాధ్యాయుడు చెర్లపల్లి రాజు మృతి చెందారు. కోడేరుకు చెందిన రాజు(35)జనుంపల్లి పంచాయతీ వార్లగడిసెలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఛాతి లో నొప్పివస్తోందని భార్యకు చెప్పడంతో వెంటనే డాక్టర్‌ను పిలుచుకొచ్చి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వెంటనే 108లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు ఉన్నారు. రాజు మరణ వార్త తెలియగానే మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ సర్పంచ్ కవిత, వేణుగోపాల్ యాదవ్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

వేళకు బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా


మట్లాడుతున్న రాజశేఖర్‌గౌడ్

కోడేరు: సమయపాలన ప్రకారం బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తుర్కదిన్నె గ్రామంలో విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి రోజు వనపర్తి నుంచి కోడేరుకు వచ్చే బస్సులు సమయ పాలన ప్రకారం రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతిరోజు మాచుపల్లి, సింగాయిపల్లి, తుర్కదిన్నె, ముత్తిరెడ్డిపల్లి, నాగులపల్లెల నుంచి దాదాపు 150మంది విద్యార్థులు కోడేరుకు వస్తున్నారని, బస్సులేనికారణంగా క్లాసులకు సమయం సరిపోవడం లేదన్నారు. బస్సులను సమయ పాలన ప్రకారం నడపాలని వారు డిమాండ్ చేశారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం


పెంట్లవెల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న జంగమ్మ

పెద్దకొత్తపల్లి:తల్లిపాలు తాగించడంవల్ల పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని పెద్దకొత్తపల్లి సర్పంచ్ సుల్తానమ్మ అన్నారు, మంగళవారం స్థానిక అంగన్ వాడి సెంటర్-1లో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు ఆరునెలలవరకు తల్లిపాలు తాపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు, జ్యోతి, అంజనమ్మ, ఖాజాబి, ఆయా తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: తల్లిపాలు బిడ్డకు ఇవ్వటం వలన ఆరోగ్యంతో పాటు ఎన్నో రోగాలనుండి వారిని కాపాడుకోవచ్చని అంగన్ వాడి సూపర్‌వైజర్ జంగమ్మ అన్నారు. స్థానిక అంగన్ వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవ సందర్భంగా చిన్న పిల్లల తల్లిదండ్రులకు తల్లి పాలపై అవగాహన కల్పించారు.

ఇంటింటికీ తాగునీరు

కొల్లాపూర్: కొల్లాపూర్ నగర పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచబ్యాంక్ నిధులు రూ.40 కోట్ల, 10లక్షలతో సింగోటం శ్రీవారి సముద్రం నుంచి కొల్లాపూర్ పట్టణానికి తాగునీరందించేందుకు కావాల్సిన నీటిట్యాంక్‌ల నిర్మాణాలకు మంగళవారం మంత్రి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో మాధవ స్వామి ఆలయ సమీపంలో, జమ్మన్ గట్ట కాలనీలో కూడా ట్యాంక్‌ల పనులను ప్రారంభించారు. త్వరలోనే పనులను పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిరంజన్ రావు, జడ్పీటీసీ హన్మంత్ నాయక్, నగర పంచాయతీ కమిషనర్ రామలింగం, మార్కెట్ వైస్ చైర్మన్ ఎండి.ఎక్బాల్ టీఆర్ఎస్ నాయకులు నరసింహారావు, రఘుపతిరావు, రహీంపాష, సుదర్శన్ గౌడ్, అంజన్ కుమార్, కృష్ణమ నాయుడు, బాలస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అదనపు తరగతి గదుల పనుల ప్రారంభం

కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో రూ.23 లక్షలతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను మంత్రి జూపల్లి ప్రారంభించారు.. నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఎంఈవో శ్రీనివాస్‌చారి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్ లో రాణించాలన్నారు. అలాగే పాఠశాలకు అదనంగా మరో రెండు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.16 లక్షలు, విద్యార్థులకు కంప్యూటర్ సౌకర్యం కోసం రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. పాఠశాల ఆవరణంలో వాటర్ ట్యాంకు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

గాంధీజీకి నివాళి..

గాంధీ ఉన్నత పాఠశాలలో మహాత్మ గాంధీ విగ్రహానికి మంత్రి జూపల్లి కృష్ణారావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరిత హారంలో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్ , షబ్బీర్‌అలీ, కురుమయ్య, రంగినేని కృష్ణ, శేఖర్‌గౌడ్, అరుణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ తొలగించాలని మంత్రికి మొర

కొల్లాపూర్ పట్టణంలోని కృష్ణుని వీధిలో సెల్ టవర్ వేశారని, దాన్ని వెంటనే తొలగించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్థానిక మహిళలు మొరపెట్టుకున్నారు. టవర్ ఏర్పాటు మూలంగా తమకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి టవర్‌ను తొలగించేందుకు చర్యలు చేపడుతాం అని వారికి హామీ ఇచ్చారు.

కొల్లాపూర్ సమాచారం

తహసీల్దార్	: 9000101488
వ్యవసాయాధికారి:	7288894354
ఎంపీడీఓ:	8008377455
ట్రాన్స్‌కో ఏఈ:	9440813494
పంచాయతీ కమిషనర్	9951524815
సీఐ:	9440795725
ఎస్ఐ:	9440795711

గ్యాస్ సమాచారం

భారత్ గ్యాస్: 08501- 275384

మార్కెట్ ధరలు

వేరుశెనగ	: 5000
కందులు	: 5050
వరి(1010రకం)	: 1450
మొక్కజొన్న	: 1410

విద్యారంగం సమస్యలను పరిష్కరించాలి

కొల్లాపూర్: ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, టీఎస్ టీఎస్‌పీని ప్రక్షాళన చేయాలని, లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంగళవారం ఏబీవీపీ నాయకులు డీటీ ఎండి.ఎక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ తాలుకా కన్వీనర్ మెంటే శివకృష్ణ, భాను, శ్రీకాంత్ , లింగస్వామి, శివ, నాగరాజు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించుకుంటాం

● బుడగ జంగాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య


పెద్దకొత్తపల్లి దీక్షలో మాట్లాడుతున్న కృష్ణయ్య

పెద్దకొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేవరకు తమ దీక్షలు కొనసాగుతాయని బుడగజంగాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారానికి 10వరోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్ డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గీకరణ చేపడతామన్న మాటను నిలుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బొల్లి రామకృష్ణ, మండల ఇన్ చార్జి స్వామి నర్సింహా, రమేష్, సిద్ధార్థ, రాజు, సురేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

కోడేరు: స్థానిక బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మిద్దె కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘ నాయకులు ఆది సోమనాథ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. వర్గీకరణ వ్యతిరేకంగా ఉన్న పార్టీలకు బుద్ధి చెపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆది రాజు, రామకృష్ణ, లాల్, కిరణ్, రమేష్, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

పెంట్లవెల్లి: ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందర చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుల రాములు, బత్తిని పరుశరామ్, బత్తిని రామచంద్రయ్య, వెంకటేష్, నాగరాజు, బాలకృష్ణ, భాస్కర్ తదితరులున్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

● తెలుగు మత్స్య కారుల సంప్రదాయ సంఘం మండల ఉపాధ్యక్షుడు దేవేందర్

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామంలోని దొంగ బాలయ్య చెరువులో సోమవారం వేలాది చేపలు చనిపోవడంపై తెలుగు మత్స్య కారుల సంప్రదాయ సంఘం మండల ఉపాధ్యక్షుడు దేవేందర్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని తెలుగు మత్స్య కారుల సంప్రదాయ సంఘం కార్యాలయంలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షుడు దేవేందర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మత్స్య కారులకు చేపల వేటనే జీవన ఆధారం అన్నారు. చెరువులో దుండగులు విష ప్రయోగం చేసి ఉంటే వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాని కోరారు. ఒక వేళ విష ప్రయోగం జరగకుంటే చెరువుపై ఆధార పడి జీవనం చేస్తున్న 500 కుటుంబాలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం తెలుగు మత్స్య కారులకు నష్ట పరిహారం చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వమే చేప పిల్లలను ఉచితంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు మత్స్య కారుల సంప్రదాయ సంఘం నాయకులు పిట్టల నరసింహ, గువ్వల గోపి, పి, శ్రీనివాసులు, రమేష్, రామారావు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

కొత్తకుంటను సర్వే చేయండి

తహసీల్దార్‌కు సర్పంచ్ ఫిర్యాదు

బిజినేపల్లి : మండలంలోని మమ్మాయిపల్లి కొత్తకుంట కబ్జాకు గురైందని దానిని సర్వే చేయాలని సర్పంచ్ వెంకటయ్య మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తకుంట సమీప రైతులు కబ్జా చేశారని వెంటనే అధికారులు సర్వే చేయించాలని, ఆయాకట్టు విస్తీర్ణం తెలపాలని అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు తదితరులున్నారు.

సినిమా గైడ్



శ్రీరమణ:	ఫిదా
రామకృష్ణ :	అమీ తుమీ
రవి :	గౌతమ్‌నంద

గ్యాస్ ఏజెన్సీల ఫోన్ నంబర్లు

హెచ్‌పీ గ్యాస్	08540-226218
భారత్ గ్యాస్	08540-224446

కూరగాయల ధరలు

టమాట	54	కాకరకాయ	40
దోసకాయ	14	బీట్‌రూట్	80
వంకాయ	28	చిక్కుడు	40
క్యారెట్	64	బీన్స్	60
క్యాబేజీ	20	ఉల్లిగడ్డ	16
బెండకాయ	24	ఆలుగడ్డ	16
పచ్చిమిర్చి	64	క్యాప్సికం	80
బీరకాయ	20	చామగడ	60
గోరుచిక్కుడు	28	మునక్కాయలు (కట్ట)	రూ.10
కీరదోస	80		
దొండకాయ	28	కాలిఫ్లవర్	30

బంగారు, వెండి ధరలు

బంగారం (10గ్రా):	రూ. 29,720
వెండి (కిలో):	రూ. 40,600

ఉపకార వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆర్డీఓ కార్యాలయ ఏఓకి ఏబీవీపీ నాయకుల వినతి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రమిస్తున్న నాయకులు

కందనూలు : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఏబీవీపీ నాయకులు మంగళవారం ఆర్డీవో కార్యాలయాధికారి ముత్యాలుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, జెఎల్, డిఎల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఇంటర్ ప్రవేశాలను ఆన్ లైన్ ద్వారానే చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కేజీ టూ పీజీ ఉచిత విద్య, లక్ష ఉద్యోగాల హామీని నెరవేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెం.30ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సైదులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొట్ర దినేష్, నాయకులు శివప్రసాద్, నరేష్, శ్రీశైలం, ప్రశాంత్ , మల్లేష్ పాల్గొన్నారు.

వాక్సినేషన్ పై కోర్ కమిటీ ఏర్పాటు

నాగర్‌కర్నూల్ వైద్యవిభాగం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎంఆర్ వ్యాక్సిన్ పై అవగాహన కల్పించేందుకు గాను కోర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పీపీయూనిట్ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి తెలిపారు. మంగళవారం పిపియూనిట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసూలు, ఎంఈఓ పందరినాథ్, సీడీపీఓ శైలశ్రీ, ఎంఈఓ జయశ్రీ, వైద్యాధికారి డాక్టర్ శరత్ , పంచాయత్ రాజ్ ఏఈలతో కోర్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కమిటీ సభ్యులు సంబంధిత గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అధ్యాపకులు, అంగన్ వాడీ టీచర్లు, గ్రామంలో ఉన్న ప్రతి 15 సంవత్సరాల చిన్నారుల తల్లిదండ్రులకు మిజిల్స్, రుబెల్లా వ్యాధులపై అవగాహన కల్పించి, వ్యాక్సిన్ తీసుకునేలా ప్రోత్సాహించాలని సూచించారు. ఈనెల 17 నుండి వచ్చేనెల 23వరకు నిర్దేశించిన ప్రణాళికా ప్రకారం 15 సంవత్సరాలలోపు పిల్లలందరికి ఉచితంగా ఎంఆర్ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కోర్‌కమిటీ వెంటనే తమ బాధ్యతలను కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు ఎంపిహెచ్ ఈఓ బిక్కులాల్, సూపర్‌వైజర్ రమాదేవి, ఎఎన్ ఎమ్ అనురాధ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నాగర్‌కర్నూల్ రూరల్ : జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీలోని యూపిఎస్ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు , నోట్‌బుక్స్, పెన్సిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్, శివ, కార్తీక్‌రెడ్డి, నరేష్, కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, అధ్యాపకులు సువర్ణకుమారి, నిరంజన్ , సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి సన్మానం

కందనూలు : నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వావిలాల సింహ్మాయ్యను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నోడల్ ఆఫీస్ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్‌లో జిల్లా నోడల్ అధికారిగా ఉన్న సింహ్మాయ్యను మూడు జిల్లాల అధికారిగా నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- గ్రామస్థుల ఇక్కట్లు



అంతర్గత రోడ్డు ఇలా...



వాటర్‌ట్యాంకు వద్ద నిలిచిన నీరు

నాగర్‌కర్నూల్ రూరల్ : మా గ్రామ పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బగా ఉండంటున్నారు మండల పరిధిలోని శ్రీపురం గ్రామస్థులు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్నా తమ పరిస్థితులు మాత్రం మారుమూల గ్రామానికంటే అధ్వాన్నంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు, మురుగుకాల్వలు లేకపోవడంతో చినుకు పడితే కాలు కదపలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఇళ్ల మధ్య మాత్రమే సీసీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మించారని మిగితా కాలనీల్లో కాలువలు, రోడ్లు లేక పోవడంతో వర్షం పడితే చిత్తడిచిత్తడి అవుతూ నడవవీలులేక పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్న మురుగు కాల్వల్లో చెత్తచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతూ, దోమలకు నిలయంగా మారిందంటున్నారు. గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ట్యాంకు నుండి గ్రామానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ గేట్‌వాల్వు పాడవడంతో నీరెప్పుడు ఎగజిమ్ముతూ పరిసర ప్రాంతమంతా నీటి మడుగులను తలపిస్తున్నాయి. దీంతో తాగునీరు కూడా కలుషిత మౌతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితిని ఎన్నిసార్లు అధి కారుల దృష్టికి, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రోడ్లను వేయడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నిధుల కొరత ఉంది

- చిన్నయ్య, సర్పంచ్

గ్రామంలో ఏపని చేయాలన్నా నిధుల కొరత ఉంది. ఎస్సీ బీసీ కాలనీల్లో ఇంకా సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాల్సి ఉంది. కాని, ఎమ్మెల్యే దృష్టికి పలు పర్యాయాలు తీసుకొచ్చాను. వాటర్‌ట్యాంకు వద్ద లీకయ్యే గేట్ వాల్వు మరమ్మతు పనులను వెంటనే మరమ్మతు చేసి లీకేజీని నిలిపివేయిస్తాం.

రోడ్లు బాగు చేయించండి



ఎస్సీ, బీసీ వాడల్లో ఉన్న రోడ్లన్ని చిన్నపాటి చినుకులకే చిత్తడవుతున్నాయి. మురుగు కాల్వలు లేక నీరు రోడ్లపైనే పారుతుంది. రోడ్లు బాగు చేసి మురుగు కాలువలు నిర్మిస్తే బాగుంటుంది.

- రోశయ్య, గ్రామస్థుడు

మురుగు నీటితో ఇక్కట్లు



వాటర్‌ట్యాంకు వద్ద నిత్యం నీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారింది. దోమల తాకిడికి నిద్ర పోక పోవడంతో పాటు రోగాల బారిన పడుతున్నారు.

- చెన్నయ్య, గ్రామస్థుడు

'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

కందనూలు : ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్ చార్జి మస్తాన్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహర దీక్షలను జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తామని నేడు మూడు సంవత్సరాలు గడిచినా నోరు మెదపడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలో ఉన్న బిజెపి నాయకుల తక్షణమే వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గూటవిజయ్, జిల్లా నాయకులు జగన్ రాజ్, తిర్పతయ్య, రాజేష్, శ్రీహరి, తిరుపాల్, సుధాకర్, శ్రీరాములు, రాధాకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బిజినేపల్లి : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బిజినేపల్లిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు దశరథం మాట్లాడుతూ వర్గీకరణ చేపట్టకుంటే మాదిగలు అన్ని రంగాల్లో నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గొర్ల వెంకటయ్య, చంద్రశేఖర్, కురుమయ్య, ఎర్ర రాములు, ఊశన్న, మురళీ, శ్రీను, లక్ష్మణ్, సాయిలు, రఘు, స్వామి తదితరులు పాల్గొన్నారు.


హరికిషన్ సింగ్‌సూర్జిత్‌ కు నివాళి

కందనూలు : భారత కమ్యూనిస్టు నాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ వర్ధంతి సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రైతాంగం ఎదుర్కుంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్మించి రైతు సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహానాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ అని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని స్వతంత్ర్యంగా నిలపడంలో తన వంతు కృషి చేశారన్నారు. సిపిఎం పార్టీలో ఒక్కరైన హరికిషన్ సింగ్ సూర్జిత్ తన జీవితమంతా పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. హరికిషన్ సింగ్ సూర్జిత్ పేదల పక్షపాతిగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆర్.శ్రీనివాస్, కె.గీత, మధు, కాశన్న, నవీన్ , అశోక్, విజయ్, సత్యనారాయణ్, గౌసియా, మౌనిక, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ

గంగారాన్ని
ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● **సర్పంచ్ వెంకట్‌రెడ్డి**



బిజినేపల్లి : గంగారం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు..?

గ్రామంలో సీసీ రోడ్లు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను కల్పించాం. పాఠశాలలో అదనపు గదులు నిర్మించాం. వీధి లైట్లు ఏర్పాటు చేశాం.

చెత్తను తరలించే రిక్షాలను ఉపయోగిస్తున్నారా.. ?

గ్రామంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన కుండీల్లో వేసిన చెత్తను తరలించేందుకు రిక్షాలను ఉపయోగిస్తున్నాము.

హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారా ?

ప్రణాళికా బద్ధంగా హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటాము. గ్రామానికి 40 వేల మొక్కలు లక్ష్యంతో పాఠశాలలో, అంగన్ వాడీ భవనాలు, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటుతున్నాము.

తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

వర్షాకాలంలో తాగునీటి సమస్య అక్కడక్కడా ఉంది. కానీ, ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సహకారంతో బోరుబావులు తవ్వాం. త్వరలో మోటార్లను బిగించి పైప్‌లైన్ కు కనెక్షన్లు ఇచ్చి తాగునీటి సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తాం.



ఎత్తిపోతలకు జీవం

- ప్రధాన ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల
- ఎగువ నుంచి నీరు వస్తుందనే ధైర్యంతో ముందడుగు
- భీమా-2తో వనపర్తి జిల్లా సస్యశ్యామలం
- పచ్చని తోరణంలా మారనున్న గద్వాల
- భీమా-1 ద్వారా మక్తల్ ప్రాంతం కళకళ
- కృష్ణానది ఉప్పొంగితేనే కల్వకుర్తి ఎత్తిపోతలకు నీరు

గతేడాది ప్రాజెక్టుల ద్వారా సాగు ఇలా

ప్రాజెక్టు	ఆయకట్టు	సాగైంది
నెట్టెంపాడు	2 లక్షలు	1.20లక్షలు
కల్వకుర్తి	3.75లక్షలు	1.46లక్షలు
భీమా-1	1.11లక్షలు	40వేలు
భీమా-2	92వేలు	60వేలు
జూరాల	1.04లక్షలు	1లక్ష

(ఆంధ్రజ్యోతి, వనపర్తి): ఎట్టకేలకు ఎత్తిపోతల పథకాలకు జీవం వచ్చింది. ఎగువన కర్ణాటక నుంచి కృష్ణా నదికి వరద వస్తున్న కారణంగా భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడరాదనే ఉద్దేశంతో అధికారులు ప్రధాన ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదలను ప్రారంభించారు. దీంతో సదరు పథకాల ఆయకట్టు రైతులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. కృష్ణానదిపై తెలంగాణలో ఉన్న ఏకైక ప్రాజెక్టు జూరాల. ఈ ప్రాజెక్టు ఎన్నో ఎత్తిపోతల పథకాలకు అదెరువుగా ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకాలు అన్నింటికీ ఇదే ఆధారంగా ఉంది. అయితే గతంలో ప్రతీ ఏటా వందలాది టీఎంసీలు పాలమూరు జిల్లాకు ఉపయోగపడకుండానే వేరే రాష్ట్రానికి వెళ్లేవి. నిత్యం కరువు కాటకాలతోవిలవిల్లాడే ఈ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులు నిర్మించే వెసులుబాటు లేకపోవడం, కృష్ణా నది ప్రవహించే ప్రాంతానికి ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ ప్రాంతం ఎత్తులో ఉండటంతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు అనివార్యమయ్యాయి. జూరాల ఆధారంగా గతప్రభుత్వాలు జవహార్ నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా 1,2 పథకాలను ప్రారంభించారు.అనివార్య కారణాలతో ఇణ్ణేళ్లు పెండింగ్‌లో పడిపోయినప్రాజెక్టులు స్వరాష్ట్రంలో పూర్తయ్యాయి. గతేడాది3.66లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరివ్వగాఈ సంవత్సరం దాదాపు4.50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

భవిష్యత్ పచ్చతోరణం..

ఉమ్మడి పాలమూరు జిల్లాలకు నీరందించే ఎత్తిపోతల పథకాలు ఎంతో కాలంగా పెండింగ్‌లో పడుతూ వచ్చాయి. గత సంవత్సరం ఖరీఫ్ సగంలో ఉన్నప్పుడు భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. రబీలో మిషన్ కాకతీయ ద్వారా మరమ్మతు చేసిన చెరువులు, కుంటల్లోకి నీరు వదిలారు. ఎత్తిపోతల పథకాలు కొత్తవి కావడం, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఫీడర్ చానల్స్ నిర్మించకపోవడంతో ఆయకట్టు వాటికింద స్థిరీకరించలేదు. దీంతో ఆయా చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టుకు నీరందించారు. ప్రధాన కాలువల వెంబడి ఉన్న రైతులు కూడా నీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేసుకున్నారు. గత రబీలో ఈ రకంగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 3.66 లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది. అయితే ఈ సంవత్సరం ఖరీఫ్‌కు అన్ని ఎత్తిపోతల పథకాలు అందుబాటులో ఉండటం, ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉండటంతో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశాలు ఉన్నాయి. అన్ని ఎత్తిపోతల పథకాల కింద డీసీ, ఎఫ్‌సీలు, నిర్మించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేస్తే భవిష్యత్ పాలమూరు పచ్చతోరణంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎగువ నుంచి వరద ఆశలు..

ఎగువ నుంచి వరద వస్తుందనే ఆశతో ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. వచ్చే వరద మొత్తం జూరాలకు చేరే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఎగువన వర్షాలు కురవకపోతే భవిష్యత్‌లో వనపర్తి, అచ్చంపేట, మహబూబ్‌నగర్, దేవరకద్ర మంచినీటి పథకాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పట్టిసీమ ద్వారా ఏపీ ప్రభుత్వం గోదావరి నీరు కృష్ణా బేసిన్‌లోకి మళ్లించుకుంటుండటంతో పాత ఒప్పందం ప్రకారం కర్ణాటక ప్రభుత్వం కేటాయింపుల కంటే కృష్ణానీటిలో 22 టీఎంసీలు అదనంగా వాడుకుంటున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. మళ్లీ వరద వచ్చే సమయానికి సదరు ప్రాజెక్టుల నుంచి చిన్న రిజర్వాయర్లకు నీటి మళ్లిస్తే కష్టాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

జూరాల నుంచి 4,159 క్యూసెక్కుల నీటి విడుదల..

ఈ ఏడాది కృష్ణా నది నుంచి వరద అంతంతమాత్రంగానే వస్తోంది. జూన్ నెల మొదట్లో కురిసిన వర్షాలతో భీమా నది ద్వారా కొంత నీరు జూరాల ప్రాజెక్టులోకి చేరింది. పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా మొదటల్లో 7 టీఎంసీలకు నీటిమట్టం చేరింది. ప్రస్తుతం ప్రధాన ఎత్తిపోతల పథకాలతోపాటు ఎడమ, కుడి, సమాంతర కాలువలకు నీటి విడుదల చేయడంతో 5.562 టీఎంసీలకు చేరింది. అయితే ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్‌లో పూర్తిస్థాయి సామర్థ్యానికి ఒక్క టీఎంసీ మాత్రమే తక్కువగా ఉండటంతో వారు వచ్చిన వరదను వచ్చినట్లు వదిలే అవకాశాలు ఉన్నాయి. అయితే ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఎక్కువ వరద రావడం లేదు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650, కోయిల్‌సాగర్ లిఫ్ట్ 315, ఎడమ ప్రధాన కాలువకు 900, కుడి ప్రధాన కాలువకు 656, సమాంతర కాలువకు 811, భీమా లిఫ్ట్-2కు 77 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద వస్తుందన్న ఆశల మేరకు ముందుగానే అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ప్రారంభించడంతో సంబంధిత ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆగస్టు నెలలో ఎగువన కురిసే వర్షాలపైనే నీటి విడుదల పరిమాణాలు ఆధారపడి ఉంటాయనేది సుస్పష్టంగా తెలుస్తోంది.

నీటి విడుదలతో ఆనందం



భీమా లిఫ్టుద్వారా సాగునీటిని విడుదల చేయడంతో ఆనందంగా ఉంది. కాలువల సమీపంలో ఉన్న బోరుబావుల్లో నీటి మట్టం పెరిగిసాగుకు అవసరమైనన నీరు అందుతుంది. అలాగే చెరువుల కింద ఆయకట్టు మొత్తం సాగులోకి వస్తుంది.

- జలేందర్‌రెడ్డి, రైతు, కొత్తకోట

అందరికి చేతి నిండ పని

లిఫ్టు ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో చెరువులకు జలకళ వచ్చింది. గ్రామంలోని కూలీలందరికి చేతి నిండ పని లభిస్తుంది. అలాగే రైతులకు సైతం తమ పొలాలు సాగు చేసుకోవడానికి వీలుంటుంది.



- వెంకటయ్య, సంకిరెడ్డిపల్లి

అమ్మ ఒడికి దూరం

- మాతాశిశు సంరక్షణ కార్డుల్లో అసంపూర్తి వివరాలు
- నమోదు చేయడంలో ఏఎన్ఎంల నిర్లక్ష్యం
- ట్యాబుల వినియోగానికి శిక్షణ ఇచ్చినా తెలియదంటున్న వైనం
- పుట్టిన 24 గంటల్లో వేయాల్సిన టీకాలు 4 రోజులైనా వేయని సిబ్బంది
- పట్టించుకోని పీపీ యూనిట్ ఏఓలు
- మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణ కరువు
- జిల్లాలో 198 మంది వివరాలు పెండింగ్‌లో..



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం): మహిళ గర్భం దాల్చిన వెంటనే పీహెచ్ సీ పరిధిలో ఉండే ఏఎన్ ఎం వారిని గుర్తించి, మాతా శిశు సంరక్షణ కార్డును జారీ చేస్తారు. నాటి నుంచి బిడ్డ పుట్టి, పూర్తి టీకాలు వేసే వరకు జరిగిన ప్రతి విషయాన్ని అందులో నమోదు చేస్తారు. అమ్మఒడి పథకానికి సంబంధించి గర్భిణికి నాలుగు సార్లు వైద్య పరీక్షల(ఆంటినెంటల్ చెకప్స్) వివరాలు, భర్త పేరు, పూర్తి చిరునామా, ఆధార్ కార్డు, ఇంటి నంబరుతో పాటు పీహెచ్ సీ పరిధిలో ఆ తల్లికి ఒక ఐడీ నంబర్(మదర్ ఐడీ) కూడా ఇచ్చి ఆ కార్డులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇదివరకు కాన్పు జరిగితే ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? పుట్టిన బిడ్డ వివరాలు కూడా అందులో రాయాలి. ఈ ప్రక్రియ అంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఏఎన్ ఎంలు చేయాలి. ఈ వివరాలు నమోదు చేసేందుకు వారికి ఆన్ మోల్ ట్యాబులను కూడా ఇచ్చారు. కానీ దాదాపు 80 శాతం కార్డులలో వివరాలు అసంపూర్తిగా ఉన్నాయి. మదర్ ఐడీ, పూర్వపు కాన్పు(ప్రీవియస్ డెలివరీ) వివరాలు పూర్తిగా నమోదు చేయడం లేదు. దీంతో కేసీఆర్ కిట్ ఇచ్చే క్రమంలో ఆన్ లైన్ సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా జనరల్ ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోనే ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు జరిగిన తర్వాత కేసీఆర్ కిట్ అందజేస్తారు. అక్కడే వారి కాన్పు వివరాలు నమోదు చేసి, ఆన్ లైన్ లో రాష్ట్ర కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. దాని ఆధారంగానే రూ.12 వేల ప్రోత్సాహకానికి అర్హులవుతారు. కానీ ఈ వివరాలు అసంపూర్తిగా ఉండడంతో ఆన్ లైన్ ప్రక్రియలో సమస్యలు వస్తున్నాయి. ఆ వివరాలు నమోదు చేయాలంటే పీహెచ్ సీ లాగిన్ లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా 198 మంది బాలింతల కాన్పు వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి.



జిల్లా ఆసుపత్రిలోని బాలింతలు

టీకాల డబ్బులకు అనర్హులవుతున్న వైనం

అమ్మఒడి పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేసుకొని ఆడపిల్ల పుడితే రూ. 13 వేలు, మగపిల్లవాడు పుడితే రూ. 12 వేలు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. మూడో విడతగా ఇచ్చే రూ.2 వేలు బిడ్డకు టీకాలు వేసిన తర్వాతనే ఇస్తారు. అయితే ఈ మూడు జీరో డోస్ టీకాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే మూడున్నర నెలల తర్వాత వేసే టీకాలను లెక్కకడతారు. డెలివరీ తేదీ, టీకాలు వేసిన తేదీని టాలీ చేసిన తర్వాతనే టీకాల డబ్బులకు అర్హులుగా నిర్ణయిస్తారు. కానీ పుట్టిన 24 గంటల్లో కాకుండా 6 రోజుల తర్వాత టీకాలు వేయడంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పుట్టిన 24 గంటలలోపు కాకుండా మరో 14 గంటల్లో కూడా టీకాలు వేసి, కార్డులో నమోదు చేసేందుకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. దాన్ని కూడా అమలు చేయడం లేదు.

ఏఎన్ఎంల నిర్లక్ష్యం

మాతా శిశు సంరక్షణ కార్డుల్లో ప్రతి అంశాన్నీ క్షేత్రస్థాయిలో ఉండే ఏఎన్ ఎంలు నమోదు చేయాలి. కానీ వారి నిర్లక్ష్యం కారణంగా ఈ పథకానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. అమ్మఒడి వివరాల నమోదు కోసం ట్యాబులు ఇచ్చినప్పటికీ వాటిని వినియోగించడంలో అలసత్వం వహిస్తున్నారు. వివరాల నమోదుకు ఆరు సార్లు జిల్లా, పీహెచ్ సీ స్థాయిలలో శిక్షణలు కూడా ఇచ్చారు. ఎలా నమోదు చేయాలో తెలియడం లేదని కొందరు, ట్యాబులు పనిచేయడం లేదని ఇంకొందరు, ఇంటర్నెట్ రావడం లేదని మరికొందరు సాకులు చెబుతున్నారు. వారిపై మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.


టీకాల జాడేది?

ఆస్పత్రిలో జన్మించిన 24 గంటల్లో బిడ్డకు హెపటైటిస్(బి), బీసీజీ, ఓపీజీ టీకాలు వేయాలి. ఈ విషయాన్ని ప్రతి మాతా శిశు సంరక్షణ కార్డు చివరి పేజీలో ఏయే నెలల్లో ఏయే టీకాలు వేయాలి? ఇలా ప్రతి విషయం ముద్రించి ఉంటుంది. కానీ జనరల్ ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన బిడ్డకు 24 గంటల్లో ఈ మూడు టీకాలు వేయడం లేదు. ఏఎన్ ఎంలు వారికి తోచినపుడు 3 నుంచి 6 రోజుల మధ్యలో వేస్తున్నారు. అవి కూడా బీసీజీ, ఓపీ టీకాలు మాత్రమే వేస్తున్నారు. పసిరికలకు సంబంధించిన హెపటైటిస్ బీ టీకా వేయడం లేదు. టీకాలు వేసిన తర్వాత ఆ వివరాలను కార్డులో నమోదు చేయడం లేదు. ఈ ప్రక్రియను ఆస్పత్రి ఆవరణలో ఉన్న పీపీ యూనిట్ ఏఎన్ ఎంలు నిర్వహించాల్సి ఉండగా ఏఓ కుంటి సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారు.

- గుండుమల్ గ్రామానికి చెందిన లక్ష్మి ఈనెల 22న జనరల్ ఆస్పత్రిలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రసవించింది. ఆమె బిడ్డకు బీసీజీ, ఓపీ టీకాలు మాత్రం ఈనెల 26న వేశారు. మహబూబ్‌నగర్ మండలం జమిస్తాపూర్ గ్రామానికి చెందిన యాదమ్మ ఈనెల 21న మధ్యాహ్నం ఒంటి గంటకు మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువుకు ఈనెల 27న బీసీజీ, ఓపీ వ్యాక్సిన్ ను వేశారు. ఒక్కొక్కరికి 4 నుంచి 5 రోజుల తేడాలో వ్యాక్సిన్ వేశారు. వేసిన వ్యాక్సిన్ వివరాలు కూడా కార్డులో నమోదు చేయలేదు. ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న ప్రతి ఒక్కరికి ఇలాగే జరుగుతోంది.



మాతా శిశు సంరక్షణ కార్డుల్లో అసంపూర్తిగా వివరాల నమోదు చేసిన దృశ్యం



పూర్వపు డెలివరీ వివరాలు నమోదు చేయని కార్డు

వివరాల నమోదు అడ్డంకులను తొలగిస్తాం

అమ్మఒడికి సంబంధించిన వివరాల నమోదులో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. అయితే వాటిని అధిగమించేందుకు ఎన్ హెచ్ ఎం విభాగంలో ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశాం. ఆన్ లైన్ లో వివరాల నమోదుకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వారిని సంప్రదిస్తే పరిష్కరిస్తున్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులో పూర్తి వివరాలు నమోదు చేసేలా కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. జిల్లా ఆస్పత్రిలో టీకాలు వేయకపోవడం నా దృష్టికి వచ్చింది. అందుకే అర్బన్ హెల్త్ సెంటర్ల నుంచి ఇద్దరు ఏఎన్ ఎంలను డిప్యూటేషన్ పై తీసుకుంటున్నాం. పీపీ యూనిట్‌లోని ఏఎన్ ఎంలతో పాటు ఈ ఇద్దరు కూడా అక్కడే ఉండి ఎప్పటికప్పుడు పిల్లలకు టీకాలు వేసేలా చూస్తారు. టీకాల నమోదు లేక ఏ ఒక్కరు కూడా ఆ డబ్బులు పొందేందుకు అనర్హులు కాకుండా చూస్తాం.

- డాక్టర్ హరిశ్చంద్రరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

పంటలకు ఊపిరి

- రెండురోజులుగా కురుస్తున్న వర్షం
- రైతన్నల హర్షం
- మరో రెండు రోజుల పాటు వర్షాలు

(ఆంధ్రజ్యోతి,గద్వాల) : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలను మురిపించాయి. నెల రోజుల పాటు వర్షాల కోసం ఎదురుచూసిన రైతన్నలకు కురుస్తున్న వర్షాలు పంటలను బతికించాయంటూ ఆనందపడుతున్నారు. మరో రెండు, మూడు వర్షాలు కురిస్తే వరినాట్లు మొదలుపెట్టే అవకాశం ఉంటుందని మొలకెత్తిన పత్తి, కంది, కాటన్ సీడ్, వేరుశనగ, ఇతర పంటలకు ఎంతో ఊపిరినిచ్చాయి. సాగునీరు లేక ఎండిపోతున్న క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊరటనిచ్చాయి. మరో పక్క జూరాల ప్రాజెక్టు నుంచి వస్తున్న కాలువ నీళ్లు కూడా పంటలకు ఆసరాగా నిలిచాయి.

85వేల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో 35వేల ఎకరాల్లో కాటన్ సీడ్ సాగయ్యింది. మరో పక్క 50వేల ఎకరాలకు పైగా కమర్షియల్ పత్తి కూడా ఈ సారి అధికంగా రైతులు సాగు చేశారు. జూన్ నెలలో సాధారణ వర్షాపాతం కంటే రెట్టింపు వర్షాపాతం నమోదయ్యింది. దీంతో రైతులు హడావుడిగా విత్తనాలను చల్లారు. మొలకెత్తిన విత్తనాలు పెరిగి పెద్దవడానికి అవసరమైన నీరు లభ్యం కాక ఎదగాల్సిన స్థాయిలో మొక్క ఎదగలేకపోవడంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూపుల్లో బతుకుతూ వస్తున్నారు. చివరకు జులై 31న కొద్దిపాటి వర్షం కురువగా మంగళవారం మాత్రం భారీగా వర్షాపాతం నమోదైంది. దీంతో పంట చేళ్లకు ఆశించిన స్థాయిలో వర్షపు నీరు అందడంతో రైతులు ఆనందంలో మునిగిపోయారు.

కంది, వేరుశనగ, ఆముదం పంటలు కూడా ఊపిరి

వర్షాధార పంటలుగా సాగవుతున్నటువంటి కంది, వేరుశనగ, ఆముదం, జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటలకు నెల రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలు అతలాకుతలంగా అయ్యాయి. చివరకు ఎండిపోయే దశలో మంగళవారం కురిసిన భారీ వర్షం పంటలకు ఊపిరినిచ్చాయి. ఈ పంటలు కూడా మరో నెల రోజుల పాటు వర్షాలు కురువకున్న బతకడానికి, ఏపుగా పెరగడానికి అవకాశం లభించినట్లయ్యింది. జిల్లాలో వరినాట్లు వర్షాలు లేకపోవడం వల్ల మొదలు కాలేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పింది.



సాగవుతున్న కాటన్ సీడ్ పంట

వర్షాపాతం వివరాలు

మండలం	వర్షాపాతం (మి.మీలలో)
కేటీదొడ్డి	18.8
ధరూర్	9.9
గద్వాల్	22.1
ఇటిక్యాల	60.0
మల్దకల్	17.0
గట్టు	19.9
అయిజ	6.2
రాజోలి	24.8
వడ్డేపల్లి	21.6
మానవపాడు	41.8
ఉండవెల్లి	32.2
అలంపూర్	5.04

మంగళవారం నమోదైన వర్షాపాతం

జిల్లాలో ఆగస్టు 1న 19.1సెం.మీ సాధారణ వర్షాపాతం కాగా, 23.4సెంటిమీటర్ల వర్షాపాతం నమోదైంది.

జూరాల నుంచి నీరు

నారాయణపూర్ నుంచి జూరాలకు వరద వస్తుందనేటటువంటి ఆశతో ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. తొలుతగా కుడి, ఎడమకాలువలకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా-1, 2 సమాంతర కాలువలకు నీటిని విడుదల చేశారు. భీమా లెఫ్ట్‌కు 77 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 811 క్యూసెక్కులు, లెఫ్ట్ కెనాల్‌కు 900 క్యూసెక్కులు, కుడి కాలువకు 656 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లెఫ్ట్-1 650 క్యూసెక్కులు, నెట్టెంపాడు 750 క్యూసెక్కులు విడుదల చేస్తుండడంతో రైతులు తమ పంటలను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో పక్క వరినాట్లను మొదలుపెట్టే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

కాటన్ సీడ్, కమర్షియల్ సీడ్‌పై పెరిగిన ఆశలు

తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కాటన్ సీడ్ సాగు భారీగా పెరిగింది. ప్రతి సంవత్సరం 25వేల నుంచి 30వేల ఎకరాల్లో సాగవుతున్న క్రమంలో ఈ సారి 35వేల ఎకరాలకు సాగు పెరిగింది. దీంతో వ్యాపారులు, రైతులు, జిన్నింగ్ మిల్లు యజమానులు అందరు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగు ఏపుగా పెరగడానికి దోహదపడిందని, వాతావరణం అనుకూలించిందని మురిసిపోతున్నారు. దీనికి తోడు జిల్లాలో గత సంవత్సరం 35వేల ఎకరాల్లో మిరపసాగయ్యింది. ఈ సారి ఇప్పటి వరకు ఒక ఎకరం కూడా మిరపను సాగు చేయకుండా రైతులు మొత్తానికి మొత్తంగా కమర్షియల్ సీడ్ పత్తిని సాగు చేశారు. కమర్షియల్ సీడ్ పత్తి 50వేలకు పైగా సాగయ్యింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఇదే తీరులో కురిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయని భావిస్తున్నారు.



సాగవుతున్న వరి పంట

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన





స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.

ఆల్ఫ్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరి తలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్ -ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్



1. I would if I could, and if I couldn't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	


నవ్వుల్ నవ్వుల్




రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?

రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

చుక్కలు కలపండి




దారి కనుక్కోండి



చెప్పగలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?



మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB

జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు

చెప్పగలరా? : జాబిలి

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

